RNI No. APTEL/2009/28868

# సిటిజన్ టైమ్స్

ప్రజా సమస్యలపై పోరాటమే మా లక్ష్యం

తెలుగు దినపత్రిక



CITIZEN TIMES TELUGU DAILY

సంపుటి :18 | సంచిక : 298 | సంపాదకులు : కంచర్ల సందీప్ కుమార్ | ప్రచురణ : విశాఖపట్నం | 3-9- 2026 | పేజీలు : 8 | వెల : 2/- రూ ॥

VOLUME: 18 | ISSUE : 298 | EDITOR:KANCHERLA SANDEEP KUMAR | PUBLISHED: VISAKHAPATNAM | 3-9-2026 | PAGES: 8 | PRICE : 2/- RS


## వారిని అమానవీయంగా చూశారు.. కేసులు ఎత్తేస్తాం: విజయ్



**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**

స్టాలిన్ నేతృత్వంలోని డీఎంకే (ఐవీఖ) పార్టీపై తమిళనాడు సీఎం విజయ్ (జవీ ఎఱయిఖఎ) విమర్శలు గుప్పించారు. ఆ పార్టీ అధికారంలో ఉన్న సమయంలో ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలిపిన రైతులు, ఉపాధ్యాయుల పట్ల అమానవీయంగా ప్రవర్తించారని దుయ్యబట్టారు. గత ప్రభుత్వం వారిపై పెట్టిన కేసులను పూర్తిగా ఎత్తివేస్తామని విజయ్ ఈ సందర్భంగా ప్రకటించారు. అసెంబ్లీలో సమావేశాల్లో భాగంగా సీఎం ఈ విషయాన్ని వెల్లడించారు. "మే 2021-2026 మధ్య సిప్కాట్ పారిశ్రామిక అభివృద్ధి, పరందూర్ విమానాశ్రయం వంటి ప్రాజెక్టులకు వ్యతిరేకంగా నిరసన తెలిపిన రైతులు, ఉపాధ్యాయులపై అనేక కేసులు నమోదయ్యాయి. అవి ఇప్పటికీ పెండింగ్‌లో ఉండటంతో వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అందువల్లే ఆ కేసులను ఎత్తివేయాలని నిర్ణయించుకున్నాం. మా

తరువాయి 2లో..




గోదారమ్మకు సాష్టాంగ ప్రణామం.. కాలువలో నిల్చొని చంద్రబాబు జలహారతి..

పాయకరావుపేట వద్ద ఉత్తరాంధ్రకు గోదావరి జలాలను విడుదల చేసిన సీఎం చంద్రబాబు

కాలువలోకి దిగి గోదావరి జలాలకు ప్రత్యేక పూజలు, జలహారతి

నాలుగు జిల్లాల్లో 2.87 లక్షల ఎకరాలకు సాగునీరు, 9 లక్షల మందికి తాగునీరు

గోదావరి జలాలకు అడుగడుగునా నీరాజనాలు పలికిన ఉత్తరాంధ్ర ప్రజలు


జలాలను ఉత్తరాంధ్రకు తెచ్చిన చంద్రబాబుకు రైతుల కృతజ్ఞతలు

తరువాయి 2లో..

## వరదల వేళ ఆపన్నహస్తం..

## భారత్‌కు కృతజ్ఞతలు తెలిపిన నేపాల్ ప్రధాని





**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**

ప్రకృతి విపత్తుతో అతలాకుతలమైన నేపాల్‌కు భారత్ అందించిన అపన్నహస్తంపై ఆ దేశ ప్రధాని బాలెన్ షా కృతజ్ఞతలు తెలిపారు. వరదలు సంభవించిన తొలి రోజే భారత్ స్పందించి సహాయ సామగ్రిని పంపిందని పార్లమెంటులో కొనియాడారు. మందులు, ఆహార పదార్థాలు, నీటిని శుద్ధి చేసే పరికరాలతో పాటు నిపుణులైన సహాయక బృందాన్ని పంపిందని

తరువాయి 2లో..

## మహానేతకు ఘన నివాళి

### వైఎస్సార్ సేవలు ప్రజల గుండెల్లో చిరస్థాయి

### 17వ వర్ధంతి సందర్భంగా విశాఖలో ప్రత్యేక కార్యక్రమాలు

**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, సెప్టెంబర్ 2:**

దివంగత ముఖ్యమంత్రి, మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి 17వ వర్ధంతి సందర్భంగా విశాఖపట్నంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఘనంగా నివాళులర్పించారు. మద్దిలపాలెంలోని జిల్లా పార్టీ కార్యాలయంతో పాటు పార్క్ హోటల్ సమీపంలోని వైఎస్సార్ విగ్రహం వద్ద ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లా పార్టీ అధ్యక్షులు కేకే రాజు, పార్లమెంట్ సభ్యులు గొల్ల బాబూరావు తదితరులు వైఎస్సార్ విగ్రహానికి గోదావరి జలాలతో అభిషేకం నిర్వహించి, పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలువురు పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

**పేదల పెన్నిధి వైఎస్సార్: కేకే రాజు**

ఈ సందర్భంగా కేకే రాజు మాట్లాడుతూ వైఎస్



రాజశేఖరరెడ్డి పేదల పెన్నిధిగా, రైతు బాంధవుడిగా, విద్యా ప్రదాతగా ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని అన్నారు.

తరువాయి 2లో..





## ఎడిటోరియల్

# వైసీపీలో అదే భయం...నిజమేనా ?

వైసీపీకి స్థానిక ఎన్నికలు అంటే భయమా. ఎన్నికలు జరిగితే భారీ ఓటమి సంభవిస్తుందని ఆలోచనలు ఏమైనా ఉన్నాయా. ఇదే ఇపుడు ఏపీలో హాట్ టాపిక్ గా ఉంది. ఎందుకంటే కూటమి నేతలు అయితే దీని మీదనే విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. వైసీపీ ఎన్నికలను ఎదుర్కోలేదని కూడా అంటున్నారు. ఇక ముఖ్యమంత్రి చంద్రబాబు అయితే జిల్లాలలో జరిగే అనేక సభలలో మాట్లాడుతూ వైసీపీకి స్థానిక ఎన్నికలు అంటే భయం అని సంచలన వ్యాఖ్యలు చేస్తున్నారు. ఏ ఎన్నికలు పెట్టినా ఎపుడు పెట్టినా కూడా కూటమిదే ఘన విజయం అని ఆయన అంటున్నారు. అదే సమయంలో వైసీపీ చిత్తుగా ఓటమి పాలు అవుతుందని ఆయన జోస్యం చెబుతున్నారు. ఇదిలా ఉంటే స్థానిక సంస్థల ఎన్నికల విషయంలో వైసీపీ కోర్టుకు వెళ్ళింది. సర్ ప్రక్రియ ప్రస్తుతం ఏపీలో జరుగుతోంది కాబట్టి అక్టోబర్ 3న తుది జాబితా వచ్చిన తరువాత కొత్త ఓటర్ల లిస్ట్ తో ఎన్నికలను నిర్వహించాలని వైసీపీ కోరుతోంది. ఇదే విషయం మీద కోర్టుకు వెళ్ళినట్లుగా వైసీపీ నేతలు అంటున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలను నిలిపివేయాలని, స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియ పూర్తయిన తర్వాతే ఎన్నికలు నిర్వహించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ వైసీపీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. కేంద్ర ఎన్నికల సంఘం ప్రస్తుతం సర్ ద్వారా కొత్త ఓటర్ల జాబితా సవరణ చేపడుతోంది. అయితే రాష్ట్ర ఎన్నికల సంఘం మాత్రం జనవరి 1, 2026 నాటి పాత అసెంబ్లీ ఓటర్ల జాబితా ఆధారంగా ఎన్నికలకు వెళ్లడం సరైనది కాదని వైసీపీ అభ్యంతరం వ్యక్తం చేస్తోంది. పాత జాబితా ప్రకారం అయితే మరణించిన నకిలీ ఓటర్లు స్థానిక జాబితాలో కొనసాగడం వల్ల రిజర్వేషన్లు రోటేషన్ విధానం దెబ్బతింటుందని వైసీపీ వాదిస్తోంది. సర్ ప్రక్రియ ముగిసి, అక్టోబర్‌లో తుది ఓటర్ల జాబితా వచ్చే వరకు స్థానిక సంస్థల ఎన్నికలకు ఎలాంటి నోటిఫికేషన్ విడుదల చేయకుండా నిలువరించాలని వైసీపీ కోరుతోంది. అయితే వైసీపీ పిటిషన్ దాఖలు చేయడం మీద చంద్రబాబు , మంత్రి నారాయణ తదితరులు తప్పుపట్టారు. ఓటమి భయంతోనే జగన్ కోర్టుల వెనుక దాక్కుంటున్నారని ఎన్నికలను అడ్డుకోవాలని చూస్తున్నారని విమర్శిస్తున్నారు. వైసీపీ ఎన్ని అడ్డంకులు సృష్టించినా, కోర్టుల్లో కేసులు వేసినా స్థానిక సంస్థల ఎన్నికలు జరిగి తీరుతాయని స్పష్టం చేస్తున్నారు. న్యాయస్థానం ఆదేశాలకు లోబడే ఎన్నికలు నిర్వహిస్తామని కూటమి ప్రభుత్వం చెబుతోంది. ప్రస్తుతం చూస్తే వైసీపీ పిటిషన్‌ను హైకోర్టు విచారణకు స్వీకరించింది. బీసీ రిజర్వేషన్ల వ్యవహారంతో పాటు ఓటర్ల జాబితా సవరణ అంశం కూడా కోర్టు పరిధిలో ఉండటంతో స్థానిక ఎన్నికల నోటిఫికేషన్ కొంత జాప్యం అయ్యే అవకాశం ఉందని కూడా ఇపుడు రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. స్థానిక ఎన్నికల సందడి పీక్ స్టేజ్ లో ఉండగా వైసీపీ కోర్టుని ఆశ్రయించడంతో ఆ పార్టీ మీద కూటమి నేతలు విమర్శలు చేసేందుకు ఆస్కారం ఏర్పడింది అని అంటున్నారు. సర్ ప్రక్రియ ముగిసి కొత్త ఓటర్ల జాబితా అక్టోబర్ 3న వస్తే ఆ మీదట ఎన్నికలు నిర్వహించడానికి మరో మూడు నాలుగు నెలలు పడుతుందని అంటున్నారు. ఎంత తొందరగా ఎన్నికలు వీలైతే అంతలా నిర్వహించడం వల్ల కేంద్ర ప్రభుత్వ నిధులు స్థానిక సంస్థలకు నేరుగా వచ్చే వీలు ఉంటుందని కూటమి నేతలు చెబుతున్నారు. దాంతో పాత ఓటర్ల జాబితాతో వెళ్దామని అనుకుంటున్నారని అంటున్నారు. మరి దీని మీద కోర్టు ఏ రకమైన తీర్పు కానీ డైరెక్షన్ కానీ ఇస్తుందో తెలియదు కానీ వైసీపీ కోర్టుని ఆశ్రయించడం ద్వారా ఎన్నికలు అంటే భయం అన్నట్లుగా విమర్శల పాలు అవుతోంది అంటున్నారు. ఒక విధంగా ఈ ప్రచారం జనంలోకి వెళ్లడం వైసీపీ చేస్తున్న వాదనలు పెద్దగా ఫోకస్ కాకపోవడంతో వైసీపీకి భయమన్నదే ప్రచారంగా సాగుతోంది. ఇది వైసీపీకి రాజకీయంగా ఇబ్బందిని కలిగించేదే అని అంటున్నారు.

# గోదావరి ఉరకలు.. సీఎం చంద్రబాబు సాష్టాంగ నమస్కారం

**అనకాపల్లి, సిటిజన్ టైమ్స్**

అనకాపల్లి జిల్లా పాయకరావుపేట మండలం పీఎల్ పురం వద్ద సీఎం చంద్రబాబు రెగ్యులేటర్ ఆన్ చేసి ఉత్తరాంధ్రకు గోదావరి జలాలను విడుదల చేశారు. తొలుత ఆయన పోలవరం ఎడమ ప్రధాన కాలువ శిలాఫలకం ఆవిష్కరించారు. అనంతరం ఓపెన్ టాప్ జీపులో ప్రజలకు అభివాదం చేస్తూ కాలువ వద్దకు చేరుకున్నారు. అక్కడ గోదారమ్మకు జలహారతి ఇచ్చి ప్రత్యేక పూజలు చేశారు.

ఉత్తరాంధ్ర ప్రజల దశాబ్దాల దాహార్తిని తీరుస్తూ, పోలవరం ఎడమ ప్రధాన కాలువ ద్వారా పయనించి వచ్చిన గోదావరి జలాలకు ముఖ్యమంత్రి చంద్రబాబు అపూర్వ రీతిలో స్వాగతం పలికారు. అనకాపల్లి జిల్లా పాయకరావుపేట వద్ద క్రాస్ రెగ్యులేటర్ నుంచి వస్తున్న గోదావరి జలాలకు, స్వయంగా కాలువలోనే నిల్చుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అరుణ వర్ణంలో ప్రవహిస్తున్న గోదారమ్మకు పుష్పాలు సమర్పించి, జలహారతి ఇచ్చి తన కృతజ్ఞతను చాటుకున్నారు. పవిత్ర గోదావరి జలాలను శిరస్సుపై చల్లుకున్న అనంతరం, ఉద్విగ్నభరిత వాతావరణంలో గోదావరి ప్రవాహానికి సాష్టాంగ నమస్కారం చేసి అందరినీ ఆశ్చర్యపరిచారు. బుధవారం పాయకరావుపేటలో జరిగిన ఈ చారిత్రక కార్యక్రమంలో భాగంగా, ముఖ్యమంత్రి చంద్రబాబు తొలుత శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. మంత్రులు నిమ్మల రామానాయుడు, వంగలపూడి అనిత, కొల్లు రవీంద్ర, నారాయణ, అచ్చెన్నాయుడు, కొలుసు పార్థసారధి, ఎంపీలు చింతకాయల విజయ్, సీఎం రమేశ్, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ఆయన గోదావరి జలాలను ఉత్తరాంధ్ర జిల్లాలకు విడుదల చేశారు. ఈ సందర్భంగా సాంప్రదాయ కోలాటంతో కళాకారులు ముఖ్యమంత్రికి ఘన స్వాగతం పలికారు. రూ.4,192 కోట్ల వ్యయంతో నిర్మించిన పోలవరం ఎడమ కాలువ ద్వారా విడుదల చేసిన ఈ నీటితో నాలుగు జిల్లాల పరిధిలో 2.87 లక్షల ఎకరాలకు సాగునీరు, 9 లక్షల మందికి తాగునీరు అందించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. మొత్తం 23.44 టీఎంసీల గోదావరి జలాలతో విశాఖ, అనకాపల్లి జిల్లాల్లోని పారిశ్రామిక, తాగు, సాగునీటి అవసరాలు తీరనున్నాయి. ఈ నీటితో అనకాపల్లి వద్ద ఏలేరు కాలువతో పాటు జిల్లాలోని 110 చెరువులను నింపేందుకు జలవనరుల శాఖ ప్రణాళికలు సిద్ధం చేసింది. దీనివల్ల పుష్కర, ఏలేరు, పంపా, తాండవ, వరహా, మామిడిగెడ్డ ఆయకట్టు కింద ఉన్న మొత్తం 46,620 ఎకరాలు స్థిరీకరణ కానున్నాయి. గోదావరి జలాలు తమ ప్రాంతానికి రావడంతో స్థానిక ప్రజలు, రైతులు ఆనందోత్సాహాలతో పులకించిపోయారు. కాలువకు ఇరువైపులా నిల్చుని ప్రవాహానికి అడుగడుగునా పుష్పాంజలి ఘటిస్తూ, హారతులు పడుతూ గోదారమ్మకు స్వాగతం పలికారు. తమ ప్రాంతానికి గోదావరి జలాలను తీసుకువచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు రైతు సోదరులు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. అనంతరం ముఖ్యమంత్రి అక్కడున్న ప్రజాప్రతినిధులు, అధికారులందరినీ స్వయంగా పిలిచి శిలాఫలకం వద్ద గ్రూప్ ఫోటోలు దిగారు.

# నందమూరి హరికృష్ణ 70వ జయంతి వేడుకలు

### టీటీడీ కళ్యాణ మండపంలో ఉచిత మెగా వైద్య, రక్తదాన శిబిరాల నిర్వహణ

### ఎన్టీఆర్, హరికృష్ణ లకు నివాళులర్పించి పుష్పాంజలి ఘటించిన నేతలు



**నిమ్మకూరు: (సిటిజన్ టైమ్స్): సెప్టెంబర్: 02**

చైతన్యరథ సారథి, మాజీ మంత్రి నందమూరి హరికృష్ణ 70వ జయంతి సందర్భంగా కృష్ణా జిల్లా నిమ్మకూరు గ్రామంలోని టీటీడీ కల్యాణ మండపంలో బుధవారం ఉచిత మెగా వైద్య శిబిరం, రక్తదాన శిబిరం నిర్వహించారు. ముందుగా ఎన్టీఆర్ స్వగ్రామం నిమ్మకూరులోని నందమూరి తారకరామారావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం హరికృష్ణ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి వైద్య, రక్తదాన శిబిరాలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఏపీ ప్రభుత్వ విప్ గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావు తో పాటు కార్యక్రమంలో నందమూరి రామకృష్ణ, పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా, పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్, ఏపీఎస్‌ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణ, కృష్ణా జిల్లా టీడీపీ అధ్యక్షుడు వీరంకి వెంకట గురుమూర్తి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏపీ ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ హరికృష్ణ ప్రజల మధ్య తిరిగిన నాయకుడని, ఆయన పర్యటనలకు అపూర్వ ప్రజాదరణ లభించేదని గుర్తు చేశారు. 1995లో విద్యార్థిగా ఉన్న సమయంలో హరికృష్ణ పర్యటనను ప్రత్యక్షంగా చూసిన అనుభవాన్ని గుర్తుచేసుకుంటూ, విజయవాడ నుంచి గుడివాడ మీదుగా సాగిన ఆ యాత్రకు ప్రజలు గంటల తరబడి స్వాగతం పలికిన దృశ్యాలు ఇప్పటికీ కళ్లముందు మెదులుతున్నాయని చెప్పారు. రవాణా శాఖ మంత్రిగా హరికృష్ణ రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ట్రాక్టర్ పన్ను రద్దు వంటి నిర్ణయాలు తీసుకున్నారని పేర్కొన్నారు. గోదావరి వరదల సమయంలో జోలె పట్టి విరాళాలు సేకరిస్తూ బాధితుల కోసం కృషి చేసిన సేవాస్ఫూర్తిని గుర్తు చేసుకున్నారు. డ్రైవింగ్‌పై ఆయనకు ఉన్న మక్కువ, ప్రజలతో కలిసిమెలిసి ఉండే స్వభావం ఆయనను ప్రత్యేక నాయకుడిగా నిలబెట్టాయని అన్నారు. హరికృష్ణ సొంత గ్రామంలో ఆయన జయంతిని పురస్కరించుకుని రక్తదాన, వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు.

# ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన మహానేత వైఎస్సార్

## - వైసీపీ నేత కుంచే రమణారావు

**అమలాపురం సిటిజన్ సెప్టెంబర్ 2**

దివంగత నేత, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి డా.వైఎస్ రాజశేఖరరెడ్డి 17వ వర్ధంతి సందర్భంగా అమలాపురం నియోజకవర్గం హైస్కూల్ సెంటర్‌లో అమలాపురం నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కుంచే రమణారావు పాల్గొని వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కుంచే రమణారావు మాట్లాడుతూ.. "వైఎస్ రాజశేఖరరెడ్డి పేరు తెలుగు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిందని,పేదలు, రైతులు, మహిళలు, విద్యార్థులు, కార్మికులు, బలహీన వర్గాల సంక్షేమానికి ఆయన అమలు చేసిన పథకాలు ప్రజల జీవితాల్లో చెరగని ముద్రవేశాయని అన్నారు. ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, జలయజ్ఞం, ఉచిత విద్యుత్ వంటి అనేక సంక్షేమ కార్యక్రమాలతో కోట్లాది కుటుంబాలకు వైఎస్సార్ అండగా నిలిచారని పేర్కొన్నారు. ప్రజల కోసం నిరంతరం ఆలోచించిన మహానేతగా వైఎస్సార్ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతారని అన్నారు. ఈ కార్యక్రమంలో వేగిరాజు సాయిరాజు, సుదా గణపతి, మెండి రమేష్, ఉండ్రు రమేష్, పందిరి సుబ్బరాజు, పరమట రాజశేఖర్, నేరేడుమెల్లి శ్రీనివాసరావు, ఎం.గణేష్, మణికంఠ, వి.రమేష్ తదితరులు పాల్గొని నివాళి అర్పించారు.



# బండారులంకలో '2 ఏళ్ల నమ్మకం - అభివృద్ధి సంక్షేమం' ఇంటింటి ప్రచారం



**అమలాపురం రూరల్ సిటిజన్ టైమ్స్ సెప్టెంబర్ 02**

"2 ఏళ్ల నమ్మకం - అభివృద్ధి, సంక్షేమం" కార్యక్రమంలో భాగంగా బండారులంక గ్రామంలో ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ 2 ఏళ్ల కాలంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ప్రజల యోగక్షేమాలను అడిగి తెలుసుకుంటూ, ప్రభుత్వ పాలనపై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. కూటమి ప్రభుత్వం అందిస్తున్న సుపరిపాలనపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే కి ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో స్థానిక కూటమి నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మొదటి పేజీ తరువాయి

# మహానేతకు ఘన నివాళి

ఆయన మరణించి 17 సంవత్సరాలు గడిచినా ప్రజల గుండెల్లో



ఆయన స్థానం చెక్కుచెదరలేదని పేర్కొన్నారు.

**సంక్షేమ రంగంలో సువర్ణ అధ్యాయం..**

ఫీజు రీయింబర్స్‌మెంట్ ద్వారా పేద, మధ్యతరగతి విద్యార్థులకు ఉన్నత విద్యను చేరువ చేశారని, రైతు సంక్షేమం, మహిళా సాధికారత, ఆరోగ్య రంగంలో వైఎస్సార్ అమలు చేసిన కార్యక్రమాలు ప్రజల జీవితాల్లో గణనీయమైన మార్పు తీసుకొచ్చాయని తెలిపారు. పేదలకు మెరుగైన వైద్యం అందించాలనే లక్ష్యంతో ఆరోగ్య రంగానికి ఆయన అత్యంత ప్రాధాన్యత ఇచ్చారని గుర్తుచేశారు.

**అభివృద్ధికి వైఎస్సార్ వేసిన పునాదులు..**

రాష్ట్ర అభివృద్ధికి దీర్ఘకాలిక ప్రణాళికతో జలయజ్ఞానికి శ్రీకారం చుట్టిన ఘనత వైఎస్సార్‌కే దక్కుతుందని కేకే రాజు అన్నారు. పోలవరం, ఉత్తరాంధ్ర సాగునీటి ప్రాజెక్టులతో పాటు అనేక అభివృద్ధి కార్యక్రమాలకు ఆయన హయాంలోనే పునాదులు పడ్డాయని పేర్కొన్నారు. మహానేత వైఎస్సార్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకత్వం కృషి చేస్తోందని తెలిపారు. ఆయన ఆశయ సాధనకు పార్టీ శ్రేణులు సమష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నియోజకవర్గ సమన్వయకర్తలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని మహానేత వైఎస్సార్‌కు ఘన నివాళులర్పించారు.

# వారిని అమానవీయంగా చూశారు.. కేసులు ఎత్తేస్తాం: విజయ్

ప్రభుత్వం రైతులు, ఉపాధ్యాయుల న్యాయమైన డిమాండ్లకు అండగా నిలుస్తుంది. ఇటువంటి చర్యల వల్ల సామాన్య ప్రజలకు ప్రభుత్వంపై విశ్వాసం పెరుగుతుంది" అని విజయ్ పేర్కొన్నారు. కాగా, ఇటీవల నీట్ పరీక్షకు వ్యతిరేకంగా నిరసన తెలిపిన విద్యార్థులు, ఆందోళనకారులపైనా కేసులను ఉపసంహరించుకోవాలని సీపీఐ విజయ్‌ని కోరింది.

# వరదల వేళ ఆపన్నహస్తం.. భారత్‌కు కృతజ్ఞతలు తెలిపిన నేపాల్ ప్రధాని

వెల్లడించారు. నష్టం తీవ్రతను అంచనా వేసేందుకు పరిశీలనలు కూడా నిర్వహించారని చెప్పారు. భారత సాంకేతిక బృందాలు మారుమూల ప్రాంతాలకు చేరుకుని సహాయక చర్యలు చేపట్టాయని వివరించారు. సంక్షోభ సమయంలో భారత్ నిజమైన మిత్రదేశంగా.. అండగా నిలిచిందని ప్రశంసించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో ఇప్పటివరకు 11,993 మందిని రక్షించినట్లు షా తెలిపారు. మరో 3,916 మంది గల్లంతైనట్లు పేర్కొన్నారు. మంత్రులంతా తమ నెల జీతాన్ని విరాళంగా ఇవ్వాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. రసువా, నువాకోట్ జిల్లాలకు చెరో రూ.కోటి అత్యవసర నిధులు కేటాయించినట్లు తెలిపారు. ఈ విపత్తు రసువా, నువాకోట్, ధాదింగ్ ప్రాంతాలకే పరిమితం కాదని.. దేశం మొత్తానికీ తీరని దెబ్బ అని షా పేర్కొన్నారు. ఈ సంక్షోభాన్ని "ధైర్యం, సంకల్పంతో ఎదుర్కోవడం తప్ప.. మాకు మరో మార్గం లేదు" అని చెప్పారు. విపత్తు అనంతరం భారత్ నేపాల్‌లో భారీ స్థాయిలో మానవతా, సాంకేతిక సహాయక చర్యలు చేపట్టింది. రెస్క్యూ బృందాలు, వైద్య నిపుణులు, డీఎన్‌ఏ ఆధారిత గుర్తింపు కోసం ఫోరెన్సిక్ నిపుణులను పంపింది. నేపాల్, చైనా అధికారులతో సమన్వయం కోసం విదేశాంగ శాఖలో 24 గంటల కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసింది.

## 'బడి కోసం డొనేట్'తో ప్రభుత్వ బడుల అభివృద్ధికి చేయూత



**పాడేరు,సిటిజన్ టైమ్స్, సెప్టెంబర్ 2**

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిలో సమాజంలోని ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ టి. నిశాంతి పిలుపునిచ్చారు. ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చిన 'బడి కోసం డొనేట్' పోర్టల్‌ను సద్వినియోగం చేసుకుని దాతలు, పూర్వ విద్యార్థులు, తల్లిదండ్రులు, స్వచ్ఛంద సంస్థలు తమకు నచ్చిన ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి సహకరించాలని కోరారు. పాడేరు కలెక్టరేట్‌లో నిర్వహించిన విద్యాశాఖ సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, చిన్న సహాయం కూడా విద్యార్థుల భవిష్యత్తులో పెద్ద మార్పుకు నాంది పలుకుతుందన్నారు. పాఠశాలలకు అవసరమైన మౌలిక వసతులు, విద్యా సామగ్రి కోసం దాతలు తమ వంతు సహకారం అందించాలని సూచించారు. అనంతరం పాఠశాలల నిర్వహణ, విద్యార్థుల హాజరు, విద్యా ప్రమాణాలపై సమీక్షించి, అధికారులు నిరంతరం పాఠశాలలను తనిఖీ చేసి విద్యా ప్రమాణాల మెరుగుదలకు కృషి చేయాలని ఆదేశించారు.

## నేటి అర్ధరాత్రి నుంచి ఆర్మీ నియామక ర్యాలీ



**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, సెప్టెంబర్ 2:**

అగ్నివీర్ పథకం కింద విశాఖపట్నంలో నిర్వహించనున్న ఆర్మీ నియామక ర్యాలీ నేటి అర్ధరాత్రి నుంచి ప్రారంభం కానుంది. సెప్టెంబర్ 20వ తేదీ వరకు ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో జరగనున్న ఈ ర్యాలీకి ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాల నుంచి సుమారు 10,350 మంది అభ్యర్థులు హాజరుకానున్నారు. ర్యాలీ నిర్వహణకు జిల్లా యంత్రాంగం పకడ్బందీ ఏర్పాట్లు పూర్తి చేసింది. అభ్యర్థుల కోసం తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్, లైటింగ్, మరుగుదొడ్లు, బారికేడింగ్‌తో పాటు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించారు. ఆర్‌కే బీచ్ రోడ్డులోని ఎన్‌టీఆర్ సర్కిల్ నుంచి 1.6 కిలోమీటర్ల రన్నింగ్ ట్రాక్‌ను సిద్ధం చేయడంతో పాటు వైద్య బృందాలు, అంబులెన్సులు, ఫైర్ టెండర్లు, జనరేటర్లను అందుబాటులో ఉంచారు. ర్యాలీ సందర్భంగా సెప్టెంబర్ 2 నుంచి 20వ తేదీ వరకు ప్రతిరోజూ రాత్రి 11 గంటల నుంచి ఉదయం 7 గంటల వరకు పార్క్ హోటల్ జంక్షన్ నుంచి ఎన్‌టీఆర్ సర్కిల్ వరకు వాహనాల రాకపోకలపై ఆంక్షలు అమల్లో ఉంటాయని అధికారులు తెలిపారు. అభ్యర్థులు తమకు కేటాయించిన తేదీ, సమయానికి అవసరమైన ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని సూచించారు. ర్యాలీ విజయవంతానికి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారని జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ తెలిపారు.

## సెప్టెంబర్ 3 వరకు పెన్షన్ల పంపిణీ గడువు పొడిగింపు



**విశాఖపట్నం,సిటిజన్ టైమ్స్, సెప్టెంబర్ 2:**

రాష్ట్రవ్యాప్తంగా సామాజిక భద్రతా పెన్షన్ల పంపిణీ గడువును సెప్టెంబర్ 3వ తేదీ వరకు పొడిగించినట్లు జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ తెలిపారు. సెర్ప్ సీఈవో ఆదేశాల మేరకు విశాఖపట్నం జిల్లాలో ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానాల్లో పెన్షన్ల పంపిణీ కొనసాగుతుందని పేర్కొన్నారు. ఇంకా పంపిణీ కాని పెన్షన్లను గడువులోగా అర్హులైన లబ్ధిదారులకు అందేలా సంబంధిత అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు.

## రేపు 94, 95 వార్డుల్లో నీటి సరఫరాకు అంతరాయం

**విశాఖపట్నం,సిటిజన్ టైమ్స్, సెప్టెంబర్ 2**

కొత్త మంచినీటి పైపులైన్ అనుసంధాన పనుల కారణంగా సెప్టెంబర్ 3న పెందుర్తి జోన్ పరిధిలోని 94, 95 వార్డుల్లో మంచినీటి సరఫరాకు అంతరాయం కలగనుందని జీవీఎంసీ పర్యవేక్షక ఇంజనీర్ పల్లం రాజు తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేసేందుకు చర్యలు చేపడతామని, ప్రజలు సహకరించాలని కోరారు.

# రిసార్టుల్లో చట్టవిరుద్ధ కార్యకలాపాలకు చెక్..!

## నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవు

## రిసార్ట్ యజమానులకు సీఐ ఎర్రం నాయుడు హెచ్చరిక

**ఆనందపురం, సెప్టెంబర్ 2 (సిటిజన్ టైమ్స్):**

ఆనందపురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని రిసార్టులను చట్టవిరుద్ధ కార్యకలాపాలకు వేదికలుగా మార్చితే సహించేది లేదని ఆనందపురం సీఐ ఎర్రం నాయుడు స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘించే రిసార్ట్ యాజమాన్యాలపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు బుధవారం ఆనందపురం పోలీస్‌స్టేషన్‌లో రిసార్ట్ యజమానులతో ప్రత్యేక అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ ఎర్రం నాయుడు మాట్లాడుతూ రిసార్టుల్లో పేకాట, జూదం, వ్యభిచారం, రేవ్ పార్టీలు, మాదకద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణా వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు ఏమాత్రం అవకాశం కల్పించరాదని స్పష్టం చేశారు. అనుమతులు లేకుండా ఎలాంటి పార్టీలు నిర్వహించకూడదని సూచించారు. రిసార్టులకు వచ్చే ప్రతి అతిథి నుంచి ప్రభుత్వం జారీ చేసిన చెల్లుబాటు అయ్యే గుర్తింపు కార్డును తప్పనిసరిగా తీసుకోవాలని, వారి పూర్తి వివరాలను ప్రత్యేక రిజిస్టర్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. రిసార్ట్ ప్రాంగణమంతా నిఘా పరిధిలో ఉండేలా 24 గంటలూ పనిచేసే సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని తెలిపారు. కెమెరాల దృశ్యాలను కనీసం 30 రోజులపాటు భద్రపరిచే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజల ప్రశాంతతకు భంగం కలగకుండా రాత్రి 10 గంటల తర్వాత డీజేలు, మైకులు, ఇతర బాహ్య



ధ్వని పరికరాలను వినియోగించరాదని స్పష్టం చేశారు. ఎక్సైజ్ శాఖ నిబంధనలకు విరుద్ధంగా ఎలాంటి అనుమతులు లేకుండా మద్యం సరఫరా చేయడం, పంపిణీ చేయడం చట్టరీత్యా నేరమని హెచ్చరించారు. రిసార్టుల్లో అనుమానాస్పద వ్యక్తుల సంచారం కనిపించినా, ఏవైనా చట్టవిరుద్ధ కార్యకలాపాలు జరుగుతున్నట్లు సమాచారం తెలిసినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని



రిసార్ట్ యాజమాన్యాలను సీఐ ఎర్రం నాయుడు కోరారు. చట్టాన్ని గౌరవిస్తూ, పోలీసు శాఖ నిబంధనలను కచ్చితంగా పాటిస్తూ రిసార్టులను నిర్వహించాలని సూచించిన ఆయన, నిబంధనలను అతిక్రమించి అక్రమ కార్యకలాపాలకు పాల్పడే యాజమాన్యాలపై ఎలాంటి ఉపేక్ష లేకుండా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# సీఆర్‌జెడ్-2019 డ్రాఫ్ట్‌పై ప్రశాంతంగా ప్రజాభిప్రాయ సేకరణ






**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, సెప్టెంబర్ 02:**

విశాఖపట్నంలోని ఉడా చిల్డ్రన్ ఏరినాలో సీఆర్‌జెడ్ నోటిఫికేషన్-2019 డ్రాఫ్ట్ మ్యాపులు, నిబంధనలపై జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ అధ్యక్షతన బుధవారం ప్రజాభిప్రాయ సేకరణ ప్రశాంతంగా జరిగింది. ఏపీ కాలుష్య నియంత్రణ మండలి సీఈఈ రాజశేఖర్, ఈఈ ముకుందరావు, జిల్లా పర్యాటక శాఖ అధికారిణి మాధవి తదితరులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో నేషనల్ సెంటర్ ఫర్ సస్టైనబుల్ కోస్టల్ మేనేజ్‌మెంట్ సైంటిస్ట్ మానిక్ మహాపాత్రో, ఏపీ కోస్టల్ జోన్ మేనేజ్‌మెంట్ అథారిటీ ప్రతినిధి షేక్ సుభాన్ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సీఆర్‌జెడ్-1, 2, 3, 4 కేటగిరీల నిబంధనలను వివరించారు. ఈ సందర్భంగా సామాజిక కార్యకర్తలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, వ్యాపారులు, మత్స్యకారులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ అభిప్రాయాలు, వినతిపత్రాలు అందజేశారు. పర్యావరణ పరిరక్షణతో పాటు మత్స్యకారుల జీవనోపాధి దెబ్బతినకుండా చర్యలు తీసుకోవాలని, మధురవాడ నుంచి భీమిలి వరకు గల తీర ప్రాంతాన్ని సీఆర్‌జెడ్-3 నుంచి సీఆర్‌జెడ్-2గా పునర్వర్గీకరించాలని కోరారు. ప్రజల నుంచి వచ్చిన అన్ని సూచనలు, అభ్యంతరాలను నిబంధనల ప్రకారం రికార్డు చేసి రాష్ట్ర ప్రభుత్వానికి, తద్వారా జాతీయ కోస్టల్ జోన్ మేనేజ్‌మెంట్ అథారిటీకి పంపిస్తామని, పర్యావరణ పరిరక్షణ-అభివృద్ధి మధ్య సమతుల్యత సాధించడమే ఈ ప్లాన్ ముఖ్య ఉద్దేశమని కలెక్టర్ స్పష్టం చేశారు.

## రీ-సర్వే సకాలంలో పూర్తి చేయాలి

### రెవెన్యూ సేవల్లో ప్రజల సంతృప్తి పెంచాలి: జేసీ శ్రీపూజ




**పాడేరు, సెప్టెంబర్ 2 (సిటిజన్ టైమ్స్):**

జిల్లాలో రీ-సర్వే ప్రక్రియను సకాలంలో పూర్తి చేసి, రెవెన్యూ సేవల్లో ప్రజల సంతృప్తి స్థాయిని పెంచేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ తిరుమాని శ్రీపూజ ఆదేశించారు. బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రెవెన్యూ అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆమె మాట్లాడారు. రీ-సర్వేలో పొరపాట్లకు తావులేకుండా చర్యలు తీసుకోవాలని, పట్టాదారు పాస్‌పుస్తకాల పంపిణీని నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సూచించారు. మ్యుటేషన్లు, ఆర్ఓఆర్ దరఖాస్తులను నిష్పక్షపాతంగా పరిష్కరించాలని, ప్రజా సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. రేషన్ పంపిణీ, స్మార్ట్ కార్డుల పంపిణీపై నిరంతర పర్యవేక్షణతో ప్రజల సంతృప్తి పెంచాలని తెలిపారు.

## గుడిలోవ అభివృద్ధిపై కూటమి నేతల విస్తృత చర్చ...!!

**ఆనందపురం, సిటిజన్ టైమ్స్ సెప్టెంబర్ 2**

ఆనందపురం మండలం గుడిలోవలోని ప్రసిద్ధ శివాలయం, రంగనాథస్వామి దేవాలయాల అభివృద్ధికి మరింత ప్రాధాన్యం ఇవ్వాలని కూటమి నాయకులు పేర్కొన్నారు. ఆలయాల అభివృద్ధి, భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పన, మౌలిక వసతుల మెరుగుదల తదితర అంశాలపై బుధవారం విస్తృతంగా చర్చించారు. గుడిలోవ ట్రస్టుబోర్డు చైర్మన్ చందవరపు కుమార్ అధ్యక్షతన ఆలయ ప్రాంగణంలో కూటమి నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆలయాల ప్రస్తుత పరిస్థితి, భక్తులకు అందుతున్న సౌకర్యాలు, భవిష్యత్తులో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై నాయకులు చర్చించారు. గుడిలోవ శివాలయం, రంగనాథస్వామి దేవాలయాలకు స్థానికంగానే కాకుండా వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వస్తుంటారని, ఆలయ ప్రాంగణంలో అవసరమైన మౌలిక వసతులను మెరుగుపరిస్తే భక్తులకు మరింత సౌకర్యంగా ఉంటుందని అభిప్రాయపడ్డారు. ఆలయాల ప్రాశస్త్యాన్ని కాపాడుతూ వాటి అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. సమావేశంలో టీడీపీ నాయకులు, మండల అధ్యక్షుడు టట్రాజు అప్పారావు, ఘట్టమనేని



సుభాష్‌చంద్రబోస్, మహంతి శివాజీ, బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పీవీవీ ప్రసాదరావు పట్నాయక్, బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఉప్పాడ అప్పారావు, మాజీ సర్పంచ్ బీఆర్‌బీ నాయుడు, గుడిలోవ ట్రస్టుబోర్డు సభ్యులు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు. ఆలయాల అభివృద్ధికి సంబంధించి పలు అంశాలపై చర్చించి, భవిష్యత్తులో చేపట్టాల్సిన చర్యలపై తమ అభిప్రాయాలను వెల్లడించారు.

## విశాఖ సూక్ష్మ పరిశ్రమలకు అంతర్జాతీయ వేదిక

### ఆరు జిల్లాల నుంచి 25 సంస్థల ఎంపిక..

### 7 వరకు దరఖాస్తులకు అవకాశం

**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్ సెప్టెంబర్ 2:**

విశాఖపట్నంలో జరగనున్న పారిశ్రామిక భాగస్వామ్య సదస్సుకు ముందస్తు కార్యక్రమాల్లో భాగంగా సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల ప్రాంతీయ సదస్సు, ఉత్పత్తుల ప్రదర్శన నిర్వహించనున్నారు. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాలకు చెందిన 25 పరిశ్రమలను ఎంపిక చేయనున్నారు. వీటిలో 20 తయారీ రంగం, 5 సేవల రంగానికి చెందిన సంస్థలు ఉంటాయి. ఎంపికైన సంస్థలకు తమ ఉత్పత్తులు, ఆవిష్కరణలను ప్రదర్శించే అవకాశం కల్పించనున్నారు. ఆసక్తి గల అర్హత కలిగిన పరిశ్రమలు సెప్టెంబర్ 7లోపు దరఖాస్తు చేసుకోవాలని అధికారులు కోరారు. ఉత్తమ సంస్థలకు నవంబర్‌లో విశాఖలో జరిగే ప్రధాన పారిశ్రామిక సదస్సులో పాల్గొనే అవకాశం లభించనుంది.




## ముమ్మిడివరంలో ఘనంగా పవన్ కళ్యాణ్ జన్మదిన



### ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎంపీ హరీష్ బాలయోగి..

**ముమ్మిడివరం సిటిజన్ టైమ్స్ సెప్టెంబర్ 2**

డాక్టర్ బీ ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం,తాళ్లరేవు మండలం పి.మల్లవరం గ్రామంలో జరిగిన జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకల్లో అమలాపురం ఎంపీ గంటి హరీష్ బాలయోగి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు కేక్ ను కట్ చేశారు.ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, జన సైనికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# వైయస్సార్.. రాజకీయ నాయకుడు కాదు.. ప్రజల గుండెల్లో నిలిచిన శక్తి

## 17 ఏళ్లైనా తగ్గని మహానేత ప్రభావం.. బీవీఆర్ సంచలన వ్యాఖ్యలు






**విశాఖపట్నం, సెప్టెంబర్ 2 (సిటిజెన్ టైమ్స్):**

ప్రజల కష్టాలను తన కష్టాలుగా భావించి, సంక్షేమ పాలనకు కొత్త నిర్వచనం ఇచ్చిన మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి (వైయస్సార్) నేటికీ తెలుగు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని తెలుగు శక్తి అధినేత బీవీఆర్ అన్నారు. వైయస్సార్ 17వ వర్ధంతి సందర్భంగా విశాఖ బీచ్‌రోడ్డులోని ఆయన విగ్రహానికి నివాళులర్పించిన అనంతరం బీవీఆర్ మీడియాతో మాట్లాడారు. తెలుగుజాతి రాజకీయ చరిత్రలో ఎన్టీఆర్, వైయస్సార్ ఇద్దరూ చెరగని ముద్ర వేసుకున్న మహానాయకులని ఆయన పేర్కొన్నారు. వైయస్సార్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే రైతులకు ఉచిత విద్యుత్ అందించే నిర్ణయానికి తొలి సంతకం చేసి రైతు పక్షపాతిగా నిలిచారని గుర్తుచేశారు. ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఇందిరమ్మ ఇళ్లు వంటి పథకాల ద్వారా పేద, మధ్యతరగతి ప్రజల జీవితాల్లో సంక్షేమ విప్లవానికి నాంది పలికారని అన్నారు. 2003లో వైయస్సార్ చేపట్టిన చారిత్రాత్మక పాదయాత్ర ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకునేందుకు దోహదపడిందని, అదే ఆయనను ప్రజలకు మరింత చేరువ చేసిందని తెలిపారు. ప్రజల మధ్య నడిచి, వారి బాధలను తెలుసుకుని, వాటికి పరిష్కారం చూపేందుకు కృషి చేసిన నాయకుడిగా వైయస్సార్ ప్రత్యేక గుర్తింపు పొందారని అన్నారు. నేటి రాజకీయాల్లో ప్రజలను మభ్యపెట్టే మాటలు చెప్పే నాయకులు కాకుండా, నిజాయితీగా ప్రజల కోసం పనిచేసే సేవాభావం కలిగిన నాయకత్వం రావాల్సిన అవసరం ఉందని బీవీఆర్ పేర్కొన్నారు. రాజకీయ ప్రత్యర్థులను సైతం గౌరవిస్తూ, అందరినీ కలుపుకొని ముందుకు సాగే నాయకత్వం వైయస్సార్ ప్రత్యేకత అని కొనియాడారు. వైయస్సార్‌తో తన తండ్రి స్వర్గీయ బి.వి. రామారావుకు, తనకు మంచి అనుబంధం ఉందని బీవీఆర్ గుర్తుచేసుకున్నారు. వైయస్సార్ జీవించి ఉంటే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన జరిగేది కాదన్నది తన వ్యక్తిగత అభిప్రాయమని స్పష్టం చేశారు. ప్రారంభ రాజకీయ జీవితంలో వైయస్సార్, నారా చంద్రబాబు నాయుడు కాంగ్రెస్ పార్టీలో యువ నాయకులుగా కలిసి పనిచేశారని, 1978లో ఇద్దరూ తొలిసారిగా శాసనసభకు ఎన్నికయ్యారని తెలిపారు. రాజకీయ పరిణామాల నేపథ్యంలో అనంతరం ఇద్దరూ వేర్వేరు రాజకీయ మార్గాలను ఎంచుకుని బలమైన ప్రత్యర్థులుగా మారినప్పటికీ, గతంలో వారి మధ్య ఉన్న స్నేహబంధం ప్రత్యేకమైనదని పేర్కొన్నారు. నాయకుడు అంటే కేవలం పదవులు అనుభవించే వ్యక్తి కాదని, ప్రజల జీవితాల్లో మార్పు తీసుకువచ్చే సేవకుడని వైయస్సార్ తన పాలన ద్వారా నిరూపించారని బీవీఆర్ అన్నారు. ఆయన ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, ప్రజల పట్ల చూపిన అంకితభావం కారణంగానే 17 ఏళ్లు గడిచినా వైయస్సార్ ప్రభావం తెలుగు రాజకీయాల్లో చెక్కుచెదరకుండా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పప్పూరు నికుంజ్, కె. సతీష్, పి. రాజా తదితరులు పాల్గొన్నారు.

## చిరస్మరణీయులు వైఎస్సార్

### వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు

### స్థానిక ఎన్నికల్లో వైసీపీ జెండా ఎగురవేస్తాం: వాసుపల్లి



**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, సెప్టెంబర్ 2:**

దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రజల హృదయాల్లో చిరస్మరణీయులుగా నిలిచిపోయారని విశాఖ దక్షిణ నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ అన్నారు. జగదాంబ జంక్షన్‌లో 29వ వార్డు అధ్యక్షుడు పీతల వాసు ఆధ్వర్యంలో నిర్వహించిన వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమంలో వాసుపల్లి పాల్గొని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పేదలకు పండ్లు, చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్, జగన్ ప్రభుత్వాల హయాంలో చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల క్రెడిట్‌ను ప్రస్తుత కూటమి ప్రభుత్వం తమ ఖాతాలో వేసుకునే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. పోలవరం ప్రాజెక్టు అభివృద్ధిలో వైఎస్సార్, జగన్ ప్రభుత్వాల పాత్ర కీలకమని పేర్కొన్నారు. ప్రజలకు మెరుగైన పాలన అందించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని ఆరోపించిన వాసుపల్లి, రానున్న స్థానిక ఎన్నికల్లో వైసీపీ జెండా ఎగురవేయడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నియోజకవర్గంలో ఘనంగా జనసేన యువజన విభాగం ఆవిష్కరణ కార్యక్రమం



**తాడేపల్లిగూడెం: (సిటిజన్ టైమ్స్): సెప్టెంబర్:0 2;**

జనసేన పార్టీ అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కొణిదలపవన్ కళ్యాణ్ జన్మదినాన్ని పురస్కరించుకుని, తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో జనసేన యువజన విభాగం ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమం తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే ఒ ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ఎన్‌డీఏ కూటమి నాయకులు, జనసేన పార్టీ జిల్లా, టౌన్, మండల, గ్రామీణ ప్రాంతాల నాయకులు, గ్రామ నాయకులు, జనసేన యువజన విభాగ నాయకులు, మహిళా నాయకులు, ఆటో యూనియన్ సభ్యులు, వ్యాపార వర్గాల ప్రతినిధులు, వివిధ సంఘాల సభ్యులు, ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు మరియు యువత పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ,యువతను ప్రజాసేవలో ముందుండి పనిచేయాలని, సమాజ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. యువశక్తే జనసేనకు వెన్నెముక అని, యువత భాగస్వామ్యంతో పార్టీ మరింత బలోపేతం అవుతుందని పేర్కొన్నారు.

## రైతులు స్వచ్ఛంద పూడికతీత

**కొత్తపేట: (సిటిజన్ టైమ్స్): సెప్టెంబర్:02:**

శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల మండలంలోని కొత్తపేట గ్రామంలోని కాలువలో పూడికతీతపనులను రైతులు స్వచ్ఛందంగా చేపట్టారు. ఈ కాలువ నుంచి సుమారు 10 గ్రామాల రైతులు పంటల సాగు చేసేందుకు నీరు అందుతుందని, అయితే కాలువలో పూడిక పేరుకుపోయి నీటి ప్రవాహానికి ఆటంకంగా ఉన్నందున అధికారులుఎవరూ పట్టించుకోకపోవడంతో రైతుల స్వయంగా ముందుకు వచ్చి పూడికతీత పనులు చేపట్టారు.



## ఘనంగా డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి 17వ వర్ధంతి




వినుకొండ: (సిటిజన్ టైమ్స్): సెప్టెంబర్: 02:

వినుకొండ నియోజకవర్గం వినుకొండ పట్టణం చెక్ పోస్ట్ సెంటర్ నందు దివంగత డాక్టర్ "వైయస్ రాజశేఖర్ రెడ్డి" వర్ధంతి సందర్భంగా వైయస్.ఆర్ విగ్రహానికి పూలమాలవేసి, ఘనంగా నివాళులర్పించిన అనంతరం రాష్ట్ర బూత్ విభాగ కార్యదర్శి తుమ్మ వెంకటరెడ్డి మరియు పట్టణ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొత్తమాసు శివ ఏర్పాటు చేసిన అల్పాహారం పంపిణీ కార్యక్రమంలో వైయస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ పిఎసి మెంబర్ లివినుకొండ మాజీ శాసనసభ్యులు బొల్లా బ్రహ్మనాయుడు ,నియోజవర్గ స్థాయి నాయకులు మరియు పట్టణ, మండల నాయకులు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## గొల్ల గుప్ప ఘటనపై విచారణకు ముఖ్యమంత్రి ఆదేశాలు

**గొల్లగుప్ప: (సిటిజన్ టైమ్స్): సెప్టెంబర్: 02:**

పోలవరం జిల్లాలోని గొల్ల గొప్ప గ్రామస్తులు అస్వస్థతకు గురైన ఘటనపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులతో సమీక్ష నిర్వహించారు. గ్రామంలోని పరిస్థితులపై వైద్య అధికారులు, కలెక్టర్ తో మాట్లాడారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితుల ఆరోగ్యం నిలకడగా ఉందని ముఖ్యమంత్రికి అధికారులు తెలియజేశారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని, ఘటనపై విచారణ జరపాలని అధికారులను ముఖ్యమంత్రిఆదేశించారు.



# ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జన్మదినం ఆనందపురంలో జనసైనికుల సేవా జోరు

### ఆనందపురం నుండి ఎండాడ వరకు 100 మందితో భారీ బైక్ ర్యాలీ

### మెగా రక్తదాన శిబిరం, కేక్ కటింగ్.. 'జై కొట్టు జనసేన' లోగో ఆవిష్కరణ

### మండల కేంద్రంలో ముగింపు వేడుకలు, ఘనంగా అన్నదాన విందు






**ఆనందపురం, సిటిజన్ టైమ్స్, సెప్టెంబర్ 02:**

ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు ఆనందపురం మండలంలో అత్యంత వైభవంగా జరిగాయి. 26 పంచాయతీల మండల అధ్యక్షుడు తమ్మిన అప్పలరాజు నేతృత్వంలో సుమారు 100జూ మంది జనసైనికులు, వీర మహిళలతో కలిసి ఆనందపురం పార్టీ కార్యాలయం నుండి ఎండాడ వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం భీమిలి నియోజకవర్గ ఇంచార్జ్, రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ మెంబర్ పంచకర్ల సందీప్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అదే వేదికపై కేక్ కట్ చేసి, 'జై కొట్టు జనసేన' లోగోను ఘనంగా ఆవిష్కరించారు.

**సేవా కార్యక్రమాలు -- ముగింపు వేడుకలు**

ఎండాడలో కార్యక్రమాలు ముగిసిన అనంతరం అక్కడి నుంచి మారికవలస మీదుగా ర్యాలీ కొనసాగించి తిరిగి ఆనందపురం పార్టీ కార్యాలయానికి చేరుకున్నారు. అక్కడ కేక్ కటింగ్ అనంతరం కార్యకర్తలకు, అభిమానులకు అన్నదాన విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో విశాఖ రూరల్ సెక్రటరీ మజ్జి శ్రీను, ఉపాధ్యక్షులు గొలగాన గోవింద్ (బాలు), ప్రధాన కార్యదర్శి కోరుకొండ మూర్తి, పీఏసీఎస్ చైర్మన్ రౌతు నాగరాజు, ఏఎంసీ డైరెక్టర్ కుప్ప రామలక్ష్మి, సోషల్ మీడియా కన్వీనర్ ఆనంద్ బాయిన, గుడిలోవ దేవస్థానం వైస్ చైర్మన్ తోమురోతు అప్పలరాజు, వీర మహిళ ఉప్పాడ యశోద, ఆనందపురం జనసైనికులు ముడసల శ్రీను ,మేడిశెట్టి గౌరీ శంకర్, పలువురు ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆర్.ఎం.పి గణేషకు ఘన సన్మానం...!!



**ఆనందపురం , సిటిజన్ టైమ్స్ సెప్టెంబర్ 02**

ఆనందపురం మండలం రామవరం గ్రామంలో గ్రామీణ వైద్యుడు, సింహాచలం వాసి లోగస గణేష్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. రామవరం మాజీ సర్పంచ్ ఎర్ర రాజు ఆధ్వర్యంలో హనుమాన్ (ఫ్రెండ్స్) సభ్యులు బుధవారం గణేష్ జన్మదిన వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి లోగస గణేష్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆయన ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో నిండు నూరేళ్లు జీవించాలని ఆకాంక్షించారు. గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలు అందిస్తూ ప్రజలకు అందుబాటులో ఉంటున్న గణేష్ మరింతగా సేవలందించాలని కోరుకున్నారు. రామవరం మాజీ సర్పంచ్ ఎర్ర రాజు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు అవసరమైన సమయంలో వైద్య సేవలు అందిస్తూ లోగస గణేష్ తన వంతు సహకారం అందిస్తున్నారని తెలిపారు. ప్రజలతో స్నేహపూర్వకంగా ఉంటూ అందరికీ అందుబాటులో ఉండటం అభినందనీయమన్నారు. గణేష్ భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి ఎదిగి ప్రజలకు సేవ చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో హనుమాన్ (ఫ్రెండ్స్) సభ్యులు, స్థానికులు, స్నేహితులు పాల్గొని లోగస గణేష్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

## కొత్తపేట లో జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు

కొత్తపేట నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ బండారు శ్రీనివాస్ ఆధ్వర్యంలో వాడపాలెం నుండి కొత్తపేట వరకు భారీ బైక్ ర్యాలీ

నాదెండ్ల మనోహర్ ప్రసంగం లైవ్ కార్యక్రమంలో పాల్గొన్న కొత్తపేట నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ బండారు శ్రీనివాస్



**కొత్తపేట సిటిజన్ టైమ్స్ సెప్టెంబర్ 2**

జనసేనాని పవన్ కళ్యాణ్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని కొత్తపేట నియోజకవర్గం వాడపాలెం సెంటర్లో నియోజకవర్గ ఇంఛార్జి బండారు శ్రీనివాస్ జనసేన జెండా ఆవిష్కరించి పార్టీ నాయకులు, జనసైనికులు, వీరమహిలలుతో కలిసి భారీ బైక్ ర్యాలీని కొత్తపేటలో బండారు బుల్లి సత్యం చంద్రావతి కాపు కళ్యాణ మండపం వరకు కొనసాగింది. ర్యాలీ మార్గం మధ్యలో జనసైనికులుతో కలిసి పేదలకు అన్నదాన కార్యక్రమాలు, రక్తదాన శిబిరాలు, ఐ బ్యాంక్ వంటి సేవాకార్యక్రమాలు నిర్వహిస్తూ, మొక్కలు పంపిణీ, పర్యావరణ పరిరక్షణ కోసం మట్టి వినాయక విగ్రహాలు పంపిణీ కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం వేదిక వద్దకు చేరుకొని యువజన విభాగం ఆవిష్కరణకు సంబంధించిన మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రసంగం లైవ్ కార్యక్రమం పార్టీ శ్రేణులతో కలిసి వీక్షించారు.

## భారీగా పెరిగిన నిమ్మ ధరలు



**నెల్లూరు: (సిటిజన్ టైమ్స్): సెప్టెంబర్ :2:**

ఏపీలో నిమ్మ ధరలు భారీగా పెరిగాయి. నెల్లూరు జిల్లా పొదలకూరు మార్కెట్ లో 80 కేజీల నిమ్మ బస్తా ధర రూ.16 వేలకు చేరినట్లు వ్యాపారులు చెబుతున్నారు. దీంతో కేజీ ధర సుమారు రూ.200 పలుకుతోంది. దిగుబడి తగ్గడం, వాతావరణ పరిస్థితులు, ఇతర ప్రాంతాల్లో డిమాండ్ పెరగడం ధరల పెరుగుదలకు కారణమని వ్యాపారులు చెప్తున్నారు. గతంలో కిలో రూ.30-40 వరకు పడిపోయిన ధరలు ప్రస్తుతం గణనీయంగా పెరగడంతో నిమ్మ రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

# సం’రక్షణ’ ఏది సారూ!

### మొక్కలు నాటారు,వదిలేశారు.



**పుల్లలచెరువు :(సిటిజన్ టైమ్స్,) సెప్టెంబర్ 02**

పుల్లలచెరువులోని కాటి వీరన్న చెరువు కట్టపై ‘పర్యావరణం - పచ్చదనం’ కార్యక్రమంలో భాగంగా గత నెలలో ఆర్బాటంగా అధికారులు మొక్కలు నాటారు.ఆ తరువాత వాటి సంరక్షణ మరువగా... ఆ మొక్కలు ఇప్పుడు పూర్తిగా ఎండిపోవడం జరిగింది. మొక్కలకు రోజు మార్చి రోజు నీళ్ళు పోసినా బతికేవని.... అధికారులు ఎందుకు పట్టించుకోవడంలేదని పుల్లలచెరువు గ్రామ ప్రజలు చర్చించుకుంటున్నారు.

# వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలనపై బీఆర్ఎస్ నిరసన

## అసమర్థ కాంగ్రెస్ కు ఓటు వేయడం వల్లే రాష్ట్రం అధోగతి పాలైంది - మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి

**సిటిజన్ టైమ్స్ నాగర్ కర్నూల్ సెప్టెంబర్ 2**

నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలో వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలనపై బీఆర్ఎస్ నిరసన కార్యక్రమం చేపట్టింది. గాంధీ పార్క్ నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ అసమర్థ కాంగ్రెస్ కు ఓటు వేయడం వల్లే రాష్ట్రం అధోగతి పాలైందని విమర్శించారు. కాంగ్రెస్ పాలనలో ప్రజలు దగా పడ్డారని, కాంగ్రెస్ నేతలు బాగుపడ్డారని ఆరోపించారు. 6 గ్యారంటీలు, 420 హామీల పేరుతో ప్రజలను మోసం చేశారని, మహిళల మహాలక్ష్మి పథకం నీరుగారిందని, మహాలక్ష్మి మాత్రం కాంగ్రెస్ నేతల ఇళ్లకే వెళ్తోందని ఎద్దేవా చేశారు. రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం నిండా ముంచిందని, సాగునీరు అందించడంలో నిర్లక్ష్యం చేస్తోందని, షాపుల్లో యూరియా లేదని, యాప్ లో మాత్రం నమోదు చేస్తున్నారని, విద్యుత్ కోతలతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. రైతు భరోసా రూ.15 వేలు, మహిళలకు రూ.2500, వికలాంగులకు రూ.6 వేల పెన్షన్, రూ.500కే గ్యాస్ సిలిండర్ హామీలను సక్రమంగా అమలు చేయలేదని ప్రశ్నించారు. కేసీఆర్ హయాంలో ఇచ్చిన ఉద్యోగాలనే కాంగ్రెస్ ప్రభుత్వం భర్తీ చేస్తోందని, నిరుద్యోగ భృతి, ఫీజు రీయింబర్స్ మెంట్ అమలు చేయకుండా యువత, విద్యార్థులను మోసం చేశారని విమర్శించారు. తెలంగాణలో రైతు భయపడే పరిస్థితులు నెలకొన్నాయని, ప్రజా సమస్యలను గాలికి వదిలి ఎమ్మెల్యేలు, మంత్రులు పైసల సంపాదనపైనే దృష్టి పెట్టారని ఆరోపించారు. కేసీఆర్ హయాంలో సాగునీరు, విద్యుత్, రైతుబంధు, ఎరువులతో రైతులకు




అండగా నిలిచారని తెలిపారు. కాళేశ్వరం అవినీతిపై ఆధారాలు ఉంటే



నిరూపించాలని సీఎం రేవంత్ రెడ్డికి సవాల్ విసిరారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులు, మహిళలు, యువత, విద్యార్థులు, వికలాంగులకు బాకీ పడిందని, రైతు భరోసా ఆరు పర్యాయాలు ఇవ్వాల్సి ఉండగా మూడు సార్లు మాత్రమే ఇచ్చారని, వ్యవసాయ కూలీలు, కౌలు రైతులు, ఆటో కార్మికులకు ఇచ్చిన హామీలను విస్మరించారని విమర్శించారు.

33 నెలల కాంగ్రెస్ పాలనలో ప్రజలకు ఒరిగిందేమీ లేదని, ప్రచార ఆర్భాటమే మిగిలిందని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ వైఫల్యాలపై ఏడు రోజుల పాటు నిరసన కార్యక్రమాలు చేపడతామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, రైతులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బద్వేల్ లో హైటెక్ దోపిడీ!

# ఐఫోన్ తో పేకాట మోసం!

**బద్వేలు, సిటిజన్ టైమ్స్: సెప్టెంబర్ 2**

బద్వేలు పట్టణంలోని ఎన్జీవో కాలనీ రోడ్డులో ని ఒక ఇంట్లో టెక్నాలజీ తో మంగతాయి (జూదం) ఆడుతున్నారని పక్క సమాచారంతోపోలీసులు దాడి చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి మైదుకూరు డీఎస్పీ రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో, బద్వేల్ ఇన్స్పెక్టర్ రామకృష్ణ, ఎస్సై లు జయరాములు, రంగారావు టీం మంగళవారం సాయంత్రం ఆ ఇంటిపై మెరుపు దాడి చేసింది. అక్కడ కనిపించిన దృశ్యం పోలీసులనే షాక్ కి గురి చేసింది.నిందితులు ఢిల్లీ నుండి తెప్పించిన ఐఫోన్ మోడల్ స్కానింగ్ డివైజ్, బ్లూటూత్, ఇయర్ ఫోన్లతో పేక ముక్కను స్కాన్ చేస్తున్నారు. ఏ ముక్క లోపల పడుతుందో, ఏది బయట పడుతుందో ముందే తెలిసిపోతుంది. దాంతో జూదానికి వచ్చే అమాయకుల జేబులు ఖాళీ చేస్తున్నారు. పక్కనే అక్రమ మద్యం దందా. వైన్ షాపుల్లో కొన్న బాటిళ్లను రెట్టింపు ధరకు అమ్ముతున్నారని,ఈ దాడిలో 9 మంది ముఠా పట్టుబడింది. వారి నుండి రూ.40,500 నగదు, 3 స్కానింగ్ డివైజ్ లు, 35 లిక్కర్ బాటిళ్లు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.నిందితులు - పుంగనూరు శ్రీకాంత్ రెడ్డి, షేక్ నూతి శ్రీను, పాల వెంకటరమణ, నారబోయిన సాంబయ్య, చిలుమూరు శివారెడ్డి, కందుకూరి బాబు, రసూల్, పుంగనూరు రామకృష్ణ, ఉంద్రా హరి పట్టుబడినట్లు పోలీసులు తెలిపారు. జూదం ఆడటమే నేరమని, టెక్నాలజీతో మోసం చేయడం అతి పెద్ద నేరమని డీఎస్పీ రాజేంద్రప్రసాద్ హెచ్చరించారు. ఇలాంటి దందాలపై సమాచారం ఇవ్వాలని, సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.




# ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ ఆధ్వర్యంలో పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు



**పి గన్నవరం సిటిజన్ టైమ్స్ సెప్టెంబర్ 2**

జనసేన పార్టీ అధినేత, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని పి.గన్నవరం నియోజకవర్గంలో జనసేన పార్టీ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. పి.గన్నవరం మండలం పోతవరం మొగలడంక నుంచి ధనవర్ష ఫంక్షన్ హాల్ వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. పి.గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు గిడ్డి సత్యనారాయణ బైక్ ర్యాలీలో పాల్గొని జనసైనికులు, యువతలో ఉత్సాహాన్ని నింపారు. బైక్ ర్యాలీలో జనసేన నాయకులు, జనసైనికులు, వీరమహిళలు, యువత, పవన్ కళ్యాణ్ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం ధనవర్ష ఫంక్షన్ హాల్లో నిర్వహించిన కార్యక్రమంలో పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకల్లో భాగంగా కేక్ కటింగ్, ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్ఈడి స్క్రీన్ ద్వారా జనసేనాని పవన్ కళ్యాణ్ సందేశం, జన్మదిన వేడుకలను వీక్షించారు. పవన్ కళ్యాణ్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని నియోజకవర్గంలో మెగా రక్తదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ.. పవన్ కళ్యాణ్ నాయకత్వంలో జనసేన పార్టీ మరింత బలోపేతం కావాలని, ఆయనకు ఆయురారోగ్యాలు, సంపూర్ణ ఆరోగ్యం, సుఖసంతోషాలు కలగాలని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ ఆకాంక్షించారు. పి గన్నవరం శాసనసభ్యులు గిడ్డి సత్యనారాయణ పిలుపుమేరకు పి గన్నవరం నియోజకవర్గంలో ప్రతి గ్రామంలోనూ మండల ముఖ్య కూడలి లోను జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించినారు. ఈ వేడుకలలో రక్తదానం శిబిరాలు, పేదలకు ఉచిత అన్నదానములు, వస్త్ర దానం, వృద్ధులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేసినారు. ముఖ్యంగా అయినవిల్లి మండలం వీరవల్లిపాలెం గ్రామంలో జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ పుట్టినరోజు వేడుకలు ఘనంగా జరిపారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు,కూటమి నాయకులు, జనసైనికులు, వీరమహిళలు, యువత, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేశారు.

# ఘనంగా డాక్టర్ వైయస్సార్ 17వ వర్ధంతి వేడుకలు

**బద్వేలు, సిటిజన్ టైమ్స్ సెప్టెంబర్ 2**

దివంగత నేత ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ దివంగత ముఖ్యమంత్రి కీర్తిశేషులు డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి 17వ వర్ధంతి బద్వేల్ లో వైఎస్ఆర్సిపి నాయకులు కార్యకర్తలు బుధవారం ఘనంగా నిర్వహించారు .ఈ కార్యక్రమంలో బద్వేల్ పట్టణంలో గుంతపల్లి రోడ్డు, పోరుమామిళ్ల బైపాస్ రోడ్డు, ఎన్జీవో కాలనీలో ఉన్న వైఎస్ఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బద్వేలు శాసన సభ్యురాలు డాక్టర్ సుధ , వైఎస్ఆర్సిపి అగ్ర నాయకులు, కార్యకర్తలు, వైయస్సార్ అభిమానులు ఘనంగా దివంగత నేత రాజశేఖర్ రెడ్డి కి కి నివాళులు అర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీలోని అన్ని వార్డులలో ఉన్న వైఎస్ఆర్సిపి కార్యకర్తలు, అభిమానులు పాల్గొని వైయస్సార్ అమరహై



నినాదాలతో హోరెత్తించారు.

## పవన్ కళ్యాణ్ జన్మదినం సందర్భంగా జోరు వర్షంలోనూ ప్రారంభమైన జనసేన యువజన విభాగం ఆవిష్కరణ బైక్ ర్యాలీ.

### జనసేన శ్రేణులతో కలిసి ర్యాలీలో ఉత్సాహంగా పాల్గొన్న ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు



**పిప్పర: (సిటిజన్ టైమ్స్): సెప్టెంబర్: 02:**

జనసేన పార్టీ అధినేత, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ జన్మదినాన్ని పురస్కరించుకొని, జనసేన పార్టీ యువజన విభాగం ఆవిష్కరణ కార్యక్రమంలో భాగంగా ఉంగుటూరు నియోజకవర్గం గణపవరం మండలం పిప్పర నుంచి జోరు వర్షాన్ని సైతం లెక్కచేయకుండా ఉంగుటూరు శాసనసభ్యులు శ్రీ పత్సమట్ల ధర్మరాజు ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ ప్రారంభమైంది. ఈ సందర్భంగా గణపవరం మండలంలోని పలు గ్రామాల నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చిన జనసైనికులు ర్యాలీలో పాల్గొని తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు ఆధ్వర్యంలో ప్రారంభమైన ఈ బైక్ ర్యాలీ ఉత్సాహంగా ముందుకు సాగింది. ర్యాలీ ప్రారంభోత్సవానికి ముందుగా పిప్పర గ్రామంలో జనసేన జండా స్తూపాన్ని ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో మండల, గ్రామస్థాయి జనసేన పార్టీ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు, జనసేన వీర మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# తడి- పొడి చెత్త సేకరణ పై చర్యలు తీసుకోవాలి

### -జిల్లా కలెక్టర్ డా.ఆర్.మహేష్ కుమార్.



**అమలాపురం సిటిజన్ టైమ్స్ సెప్టెంబర్ 2**

జిల్లాలో మండల,గ్రామ స్థాయిలో తడి- పొడి చెత్త సేకరణ పై తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ మున్సిపల్ పంచాయతీ అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్లోని కలెక్టర్ ఛాంబర్ నందు మున్సిపల్, పంచాయతీ, జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారులతో ప్లాస్మా ప్లాంట్ వ్యర్థాల నిర్వహణ పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్లాస్మా ప్లాంట్ వ్యర్థాల నిర్వహణపై మున్సిపల్ అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్లాస్మా ప్లాంట్లో తడి పొడి చెత్త నిర్వహణలో భాగంగా తడి చెత్త ఎక్కువ సేకరణ జరుగుతుందని, మండల గ్రామస్థాయిలో ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణపై మున్సిపల్ పంచాయతీ అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో అమలాపురం మున్సిపల్ కమిషనర్ వి నిర్మల్ కుమార్, జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి ఎం.మురళీకృష్ణ, ఏపీఈపీడీసీఎల్ ఈఈ డి.రాజబాబు, మున్సిపల్ ఏఈ ఆర్ వెంకటేష్, మిరాయి కంపెనీ ప్రతినిధులు భరత్, ప్రవీణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు

## పుల్లలచెరువు లో అభిమానుల సందడి





**(పుల్లలచెరువు:(సిటిజన్ టైమ్స్ ) సెప్టెంబర్ 02.)**
జనసేన పార్టీ అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలను మండల కేంద్రమైన పుల్లలచెరువు లో అభిమానులు, నాయకులు, కార్యకర్తలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పుల్లలచెరువు స్థానిక ఆర్టీసీ బస్టాండ్ నుండి గ్రామంలో జనసేన పార్టీ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, పవన్ కళ్యాణ్ ఆయురారోగ్యాలతో మరిన్ని పుట్టినరోజులు జరుపుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం జనసేన పార్టీ కార్యాలయంలో కేక్‌ను కట్ చేసి పవన్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమానికి హాజరైన కార్యకర్తలు, నాయకులు, అభిమానులు, ప్రజలకు విందు భోజనాలు ఏర్పాటు చేశారు. అభిమానులు, ప్రజలతో నాయకులు మమేకమై కేక్ కటింగ్ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అలాగే పలు సామాజిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ వేడుకలు అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు

### ముఖ్య అతిథులుగా పాల్గొన్న వాసంశెట్టి సత్యం పోలిశెట్టి చంద్రశేఖర్



**రామచంద్రాపురం సిటిజన్ టైమ్స్ సెప్టెంబర్ 2:**
ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి జనసేన పార్టీ వ్యవస్థాపకులు కొణిదెల పవన్ కళ్యాణ్ జన్మదిన పురస్కరించుకుని రామచంద్రపురం పట్టణం మరియు నియోజకవర్గంలో జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. మొదటగా రామచంద్రపురం పట్టణం జనసేన పార్టీ ఆఫీస్ లో కేక్ కటింగ్ అనంతరం తెలుగుదేశం పార్టీ ఆఫీసులో సత్యం ఫౌండేషన్ సత్యం తో పోలిశెట్టి చంద్రశేఖర్ కలిసి కేక్ కటింగ్ చేయడం జరిగింది. అనంతరం ఏరియా ఆసుపత్రి లో బ్లడ్ బ్యాంక్ నందు రక్తదాన శిబిరం ప్రారంభించారు. ఈరోజు జనసేన పార్టీలో యువతీయువకులకు పెద్దపీట వేస్తూ మా అధినేత పవన్ కళ్యాణ్ యువజన విభాగాన్ని ప్రారంభించారు. జన్మదిన వేడుకల్లో భాగంగా యువతీ యువకులచే బ్లడ్ డొనేషన్ క్యాంప్ రామచంద్రపురం ఏరియా ఆసుపత్రి లో పవన్ కళ్యాణ్ అభిమానులు యువత చే కార్యక్రమం చేయడం జరిగింది. రామచంద్రపురం పట్టణంలో కార్యక్రమాల అనంతరం జనసేన పార్టీ రామచంద్రపురం నియోజకవర్గ ఇన్చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్ ద్రాక్షారామ మెండుస్ కళ్యాణ మండపంలో జన్మదిన వేడుకలకు వెళ్లడం జరిగినది. పట్టణంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలకు పార్టీ నాయకులు కార్యకర్తలు వీర మహిళలు అభిమానులు యువత అధిక సంఖ్యలో పాల్గొని జన్మదిన వేడుకలు నిర్వహించారు.

## అంతర్జాతీయ కొబ్బరి దినోత్సవం

**కొత్తపేట సిటిజన్ టైమ్స్ సెప్టెంబర్02**
విశ్వ కవి వేమన ప్రభుత్వ డిగ్రీ కళాశాల కొత్తపేట నందు, వృక్ష శాస్త్ర విభాగం వారిచే నిర్వహించబడిన అంతర్జాతీయ కొబ్బరి దినోత్సవమునకు కళాశాల ప్రిన్సిపల్ పెద్దిరాజు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డా. కే.పెద్దిరాజు కార్యక్రమం ను ఉద్దేశించి మాట్లాడుతూ ఆహార ఉత్పత్తుల లో కొబ్బరి ప్రత్యేక ప్రయోజనాలు, ఆయుర్వేదంలో కొబ్బరి నూనెను విరివిగా ఉపయోగించడంలో దాని ఔషధగుణాలను గురించి, కొబ్బరి సాగును ప్రోత్సహించడం, రైతులకు సహాయపడటం, కొబ్బరి ఆధారిత ఉత్పత్తుల ప్రాముఖ్యతను గురించి తెలిపారు. ఈ కార్యక్రమంలో మన కళాశాల ఆర్థిక శాస్త్ర అధ్యాపకులు డా.రమాదేవి ,రసాయన శాస్త్ర అధ్యాపకులు జి.శ్రీనివాసులు, జంతు శాస్త్ర అధ్యాపకులు బి.విజయకుమార్,వృక్ష శాస్త్ర అధ్యాపకులు హేమలత, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.






## రెవెన్యూ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి త్వరలో భేటీ

### ఉద్యోగ సంఘాల నేతలతో సమావేశం ఏర్పాటు చేస్తాం: మంత్రి అనగాని సత్యప్రసాద్

**అమరావతి, సిటిజన్ టైమ్స్, సెప్టెంబర్ 2:**
రాష్ట్రంలో రెవెన్యూ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం త్వరలో ఉద్యోగ సంఘాల నేతలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేస్తామని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. బుధవారం రాష్ట్ర సచివాలయంలో మంత్రిని అమరావతి రెవెన్యూ ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్ భూపతిరాజు రవీంద్రరాజు, రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం అసోసియేట్ అధ్యక్షుడు రాటకొండ శ్రీనివాస్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మిరియాల లక్ష్మీనారాయణ కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రెవెన్యూ శాఖలో పనిచేస్తున్న వీఆర్ఏలు, వీఆర్వోలు, సర్వేయర్లు తదితర ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను నాయకులు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఇప్పటికే పలుమార్లు సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చినా పరిష్కారం లభించలేదని వివరించారు. అలాగే ఉద్యోగులకు రావాల్సిన పెండింగ్ డీఏలు, ఐఆర్, పీఆర్సీ కమిషన్‌కు సంబంధించిన అంశాలను కూడా పరిష్కరించాలని కోరారు. దీనిపై మంత్రి అనగాని సత్యప్రసాద్ సానుకూలంగా స్పందిస్తూ రెవెన్యూ ఉద్యోగుల సమస్యలపై ఉద్యోగ సంఘాల నేతలతో చర్చించి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ



ఇచ్చారు. పెండింగ్ డీఏలు, ఐఆర్, పీఆర్సీకి సంబంధించిన ఆర్థిక అంశాలను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లి చర్చిస్తామని తెలిపారు. ఉద్యోగులతో సానుకూల చర్చలు జరిపి న్యాయం చేస్తామని మంత్రి హామీ ఇచ్చినట్లు అమరావతి రెవెన్యూ ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్ భూపతిరాజు రవీంద్రరాజు ప్రకటనలో తెలిపారు.

## రూ.6 కోట్లతో బీసీ హాస్టళ్లకు శానిటరీ కిట్లు

### పారిశుధ్య నిర్వహణకు 1,200 మంది వర్కర్ల నియామకం..




**విజయవాడ, సిటిజన్ టైమ్స్, సెప్టెంబర్ 02**
రాష్ట్రంలోని బీసీ హాస్టళ్ల రూపురేఖలు మార్చి, విద్యార్థులకు పరిశుభ్రమైన వాతావరణంలో నాణ్యమైన విద్యనందించడమే ప్రభుత్వ ధ్యేయమని బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్. సవిత స్పష్టం చేశారు. విజయవాడ గుణదలలోని బీసీ బాలికల కళాశాల వసతి గృహంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పారిశుధ్య కార్మికులకు

### డైట్ చార్జీలు 10 శాతం పెంపు: మంత్రి సవిత

శానిటరీ కిట్లను పంపిణీ చేశారు. వసతి గృహాల్లో పారిశుధ్య సమస్యల శాశ్వత పరిష్కారానికి రూ.6 కోట్ల వ్యయంతో 11 రకాల వస్తువులతో కూడిన కిట్లను అందజేస్తున్నట్లు మంత్రి తెలిపారు. హాస్టళ్లను 1 నుంచి 5-స్టార్ కేటగిరీలుగా వర్గీకరించి, పర్యవేక్షణకు ప్రత్యేక ఎస్‌వోపీలు అమలు చేస్తున్నామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 1,200 మంది శానిటేషన్ సిబ్బందిని నియమించడంతో పాటు 1,100 కొత్త టాయిలెట్లు, తాగునీటి కోసం ఆర్‌వో ప్లాంట్లు, విద్యుత్ అంతరాయం కలగకుండా ఇన్వర్టర్లు సమకూర్చినట్లు వివరించారు. విద్యార్థులకు పౌష్టికాహారం అందించేందుకు డైట్ ఛార్జీలను 10 శాతం పెంచామని, అవసరమైన కొత్త వంట సామగ్రితో పాటు సహాయకులను నియమిస్తున్నామని పేర్కొన్నారు. రాబోయే టెన్త్, ఇంటర్ పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాల సాధనకు రాత్రి వేళల్లో ప్రత్యేక కోచింగ్ తరగతులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. శాఖ కార్యదర్శి ఎస్. సత్యనారాయణ, డైరెక్టర్ ఆర్. మల్లిఖార్జున పాల్గొన్న ఈ కార్యక్రమంలో అనంతరం విద్యార్థినులతో కలిసి మంత్రి మధ్యాహ్న భోజనం చేశారు.

## ఎయిడ్స్‌పై నిర్మూలనపై కథ రూపంలో అవగాహన

### పరిశీలించిన దిశా క్లస్టర్ ప్రోగ్రాము మేనేజర్ బాలజీ

**అమలాపురం, సిటిజన్ టైమ్స్ సెప్టెంబర్ :2**
డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలోని వేపచెట్టు వీధిలో ఉన్న గవర్నమెంట్ జూనియర్ కళాశాలలో కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ శాంతి రాజశ్రీ గారి ఆదరర్యంలో విద్యార్థులకు హెచ్ఐవీ/ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ప్రాజెక్టు డైరెక్టర్ ఆదేశాల మేరకు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ విభాగం సూచనలతో దిశా/జనకళ్యాణ్ ప్రివెన్షన్ యూనిట్ సహకారంతో ఇంటెన్సిఫైడ్ ఐఈసీ క్యాంపెయిన్‌లో భాగంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా దిశా క్లస్టర్ ప్రోగ్రాము మేనేజర్ ఏరియా హాస్పిటల్ ఐసీటీసీ కౌన్సిలర్ పి. బాలజీ విద్యార్థులకు హెచ్ఐవీ ఎలా సంక్రమిస్తుంది, ఎలా సంక్రమించదు, హెచ్ఐవీ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, హెచ్ఐవీ సోకిన వారికి అందుబాటులో ఉన్న చికిత్సా సేవలపై అవగాహన కల్పించారు. సుఖవ్యాధులు, టీబీ, డ్రగ్స్ వినియోగం, హెచ్ఐవీ బాధితుల పట్ల వివక్ష చూపకూడదనే అంశాలను వివరించారు. అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో హెచ్ఐవీ/ఎయిడ్స్‌కు సంబంధించిన పలు ఉచిత సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. 1097 టోల్‌ఫ్రీ నంబర్, హెచ్ఐవీ/ఎయిడ్స్ చట్టం--2017,



ఏఆర్‌టీ మందుల కేంద్రాలు తదితర అంశాలపై విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు ప్రేమనందం కళాజాత బుర్రకదా రూపంలో విద్యార్థులకు అవగాహనా కల్పించటం జరిగింది జనకళ్యాణ్ టి ఐ సిబ్బంది కరపత్రాలను పంపిణీ చేసి, క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయించడం ద్వారా సెల్ఫ్ రిస్క్ అసెస్మెంట్ ఫారమ్ను పూర్తి చేయించారు. ఈ కార్యక్రమంలో దిశా/జనకళ్యాణ్ ప్రాజెక్ట్ సిబ్బంది, ఏఎన్ఎం కె. వెంకటరమణ, ఔట్రీచ్ స్టాఫ్ ఏం వి. జ్యోతి, కే. శ్రీనివాస్ పీర్ ఎడ్యుకేటర్ గుర్రాల అమల, రాంసత్యనారాయణ ఏం.శ్యామల, కౌన్సిలర్, గవర్నమెంట్ జూనియర్ కకళాశాల అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

## అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి దర్శించిన మంత్రి పార్థసారథి



**కాకినాడ సిటిజన్ టైమ్స్ సెప్టెంబర్ 2**
అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి వారిని రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ ,గృహ నిర్మాణ శాఖా మంత్రి కొలుసు పార్థసారథి స్వామివారిని దర్శించుకున్నారు. బుధవారం ఉదయం స్వామి వారి దర్శనార్థం ఆలయానికి చేరుకున్న మంత్రి వర్యులకు దేవస్థానం చైర్మన్ ఐవి రోహిత్,ఈవో ఎన్. చక్రధర రావు స్వాగతం పలికారు. అనంతరం స్వామి వారిని దర్శించుకుని వేద పండితులచే ఆశీర్వచనం గావించి ప్రసాదాన్ని స్వీకరించారు. మంత్రి వెంట దేవస్థానం అధికారులు,ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ఎదుట ఏబీవీపీ ధర్నా

### పెండింగ్ ఫీజు రీయింబర్స్ మెంట్, స్కాలర్ షిప్ లు వెంటనే విడుదల చేయాలని డిమాండ్



**సిటిజన్ టైమ్స్ నాగర్ కర్నూల్ సెప్టెంబర్ 2**
నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ఎదుట ఏబీవీపీ ధర్నా చేపట్టింది. పెండింగ్ ఫీజు రీయింబర్స్ మెంట్, స్కాలర్ షిప్ లు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేసింది. విద్యార్థుల భవిష్యత్తుతో ప్రభుత్వం చెలగాటం ఆడొద్దని ఏబీవీపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పెండింగ్ లో ఉన్న ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలను తక్షణమే చెల్లించాలని, స్కాలర్ షిప్ లు విడుదల కాకపోవడంతో విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పరిష్కరించాలని కోరారు. విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు, విద్యార్థులు పాల్గొని ప్రభుత్వం విద్యార్థుల సమస్యలపై తక్షణమే స్పందించాలని డిమాండ్ చేశారు.

## పెన్షన్ సొమ్ములతో పరారై.. సెలవు చీటి పంపిన శివశంకర్..



**అమలాపురం రూరల్ సిటిజన్ టైమ్స్ సెప్టెంబర్ 2**
రూ.3.11 లక్షల పెన్షన్ సొమ్ములతో పరారైన కరిబండి శివశంకర్ కోసం బండారులంక నుంచి తాళ్లరేవు వరకూ సచివాలయ సిబ్బంది మంగళవారం రాత్రి వరకు వెతుకుతూనే ఉన్నారు. ఎక్కడైనా రోడ్డు ప్రమాదం జరిగిందా అని యానాం తో సహా అన్ని ప్రాంతాల్లో ఆరా తీశారు. చివరకూ బుధవారం ఉదయం శివశంకర్ తన ఫోన్ నుంచే సెలవు చీటితో పాటు నగదు భద్రం అని సమాచారం పంపించారు.అదే సెలవు చీటితో శివశంకర్ కుటుంబ సభ్యులు మధ్యాహ్నం అమలాపురం మండల పరిషత్ కార్యాలయానికి చేరుకున్నారు.ఈ నెల 1నుంచి 5వ తేదీ వరకు సెలవు మంజూరు కోరగా డిప్యూటీ ఎంపీడీవో గరిమెళ్ల రవి సదరు చీటిని అందుకున్నారు. మోటారు సైకిల్ సెల్ఫ్ యాక్సిడెంట్ కారణంగా సెలవు కోరి శివశంకర్ కుటుంబ సభ్యుల ద్వారా సొమ్ములు పంపించారు.

## జన సైనికుని మృతికి తక్షణ సహాయం

### జనసైనికుడు రోళ్ల ప్రవీణ్ కుమార్ కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ , రాజోలు ఎమ్మెల్యే దేవ వర ప్రసాద్ మంత్రి నాదెండ్ల మనోహర్



**అల్లవరం సిటిజన్ టైమ్స్ సెప్టెంబర్ 2**
జనసేన పార్టీ అధినేత, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జన్మదినం సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేస్తూ ఏర్పాటు చేసిన ఫ్లెక్స్ వద్ద జరిగిన దురదృష్టకర ప్రమాదంలో మృతి చెందిన బెండమూర్లంక గ్రామానికి చెందిన జనసైనికుడు రోళ్ల ప్రవీణ్ కుమార్ కుటుంబాన్ని ఆంధ్రప్రదేశ్ పౌరసరఫరాల శాఖ మంత్రి, జనసేన పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్ నాదెండ్ల మనోహర్, పి.గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులుగిడ్డి సత్యనారాయణ, రాజోలు ఎమ్మెల్యే దేవర ప్రసాద్, తుమ్మల బాబు పరామర్శించారు. ఈ సందర్భంగా ప్రవీణ్ కుమార్ కుటుంబ సభ్యులను ఓదార్చి, వారి కుటుంబానికి జనసేన పార్టీ, కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా కల్పించారు. ప్రవీణ్ కుమార్ మృతి పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ప్రవీణ్ కుమార్ కుటుంబానికి కొంత ఆర్థిక సహాయం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, జనసేన పార్టీ నాయకులు, జనసైనికులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పిఆర్సీ వై తహసిల్దార్ కార్యాలయం ఎదుట నిరసన

**అయినవిల్లి సిటిజన్ టైమ్స్ సెప్టెంబర్ 2**
ఏపీ జెఎసి అమరావతి ఉద్యోగ ఉపాధ్యాయ కార్మిక పెన్షనర్ల కాంటాక్ట్ అవుట్సోర్సింగ్ ఉద్యోగుల ఉద్యమ కార్యచరణలో భాగంగా రెండో రోజు అయినవిల్లి తాసిల్దార్ కార్యాలయ సిబ్బంది అందరూ వారికి పిఆర్సి కమిషన్ ని వెంటనే నియమించాలని వారికి రావలసిన డిఏ, పిఆర్సి ఎరియర్, సరెండర్ లీవులు, ఎర్న్ లీవులు బకాయిలు వెంటనే మంజూరు చేయాలని అయినవిల్లి తాసిల్దార్ కార్యాలయ ఆవరణలో వీఆర్వోలు విలేజ్ సర్వేర్లు,కార్యాలయ సిబ్బంది అందరూ నిరసన తెలపడం జరిగింది.



# పేకాట స్థావరంపై టాస్క్ ఫోర్స్ పోలీసులు దాడి

**- 3 గురు, అరెస్ట్, రూ.45200/ - నగదు 3 సెల్ ఫోన్లు, 2 మోటార్ సైకిల్ స్వాధీనం**



**ఒంగోలు, సిటిజన్ టైమ్స్ సెప్టెంబర్ 2**

ప్రకాశం జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా పలు పోలీస్ స్టేషన్ల పరిధిలో అసాంఘిక కార్యకలాపాలపై ఒంగోలు టాస్క్ ఫోర్స్ పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు.

ప్రకాశం జిల్లా చీమకుర్తి పోలీస్ స్టేషన్ చిన్న రావిపాడు గ్రామం శివారులో బుధవారం పేకాట స్థావరంపై టాస్క్ ఫోర్స్ ఇంచార్జ్ సిఐ కమలాకర్ ఆధ్వర్యంలో ఎస్సై బి.వినోద్ బాబు , ఏఎస్ఐ షేక్ మహబూబ్ బాషా, వారి సిబ్బంది ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. ఈ దాడిలో ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని, వారి వద్ద నుండి రూ.45,200/- లు నగదు, 3 మొబైల్ ఫోన్లు, రెండు మోటర్ సైకిళ్ళు స్వాధీనం చేసుకున్నారు. వారిపై సంబంధిత చట్టాల ప్రకారం కేసు నమోదు నిమిత్తం చీమకుర్తి పోలీస్ స్టేషన్లో టాస్క్ ఫోర్స్ పోలీసులు అప్పగించినట్లు ఎస్సై తెలిపారు. ఈ సందర్భంగా పోలీసులు ప్రజలకు విజ్ఞప్తి చేస్తూ, పేకాట వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు దూరంగా ఉండాలని, జూద క్రీడలు, ఇతర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడేవారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. అలాగే, జిల్లాలో ఎక్కడైనా ఇలాంటి కార్యక్రమాలకు సంబంధించి సమాచారం ఉంటే, వెంటనే డయల్ 112 నంబర్‌కు లేదా టాస్క్ ఫోర్స్ ఇంచార్జ్ సిఐ 9121102113, పోలీసు వాట్సాప్ నంబర్ 9121102266కు మెసేజ్ ద్వారా తెలియజేయాలని ప్రజలను కోరారు.

# కర్నూలులో శాశ్వత హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలి




**గిద్దలూరు, సిటిజన్ టైమ్స్ సెప్టెంబర్ 2**

కర్నూలు లో శాశ్వత హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలని గిద్దలూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలోని పిఆర్ కాలనీ లో గల కోర్ట్ కాంప్లెక్స్ బయట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు పిఎన్ శేష శయనా రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే స్పందించి కర్నూలు లో శాశ్వత హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలనే డిమాండ్ కు మద్దతుగా బుధ, గురు వారాలలో గిద్దలూరులో న్యాయవాదులు కోర్టు విధులను బహిష్కరిస్తున్నట్లు ఆయన చెప్పారు. శాశ్వత బెంచ్ ఏర్పాటు చేయకుంటే తమ నిరసనను ఇంకా ఉధృతం చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు ఏ. తిరుమల ప్రసాద్, ప్రధాన కార్యదర్శి బి. ఐజాక్, ఉప కార్యదర్శి సిహెచ్ పోలయ్య, ట్రెజరర్ షేక్ ఫాజిల్, సీనియర్, జూనియర్ మరియు మహిళా న్యాయవాదులు పాల్గొన్నారు.

# హై డెన్సిటీ ప్లాంటేషన్ స్థల పరిశీలన



**వలేటివారిపాలెం, సిటిజన్ టైమ్స్ సెప్టెంబర్ 2**

చుండి గ్రామంలోని మోడల్ స్కూల్లో, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం ఆవరణలో సాంద్ర వనీకరణ చేపట్టేందుకు జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ మంగళవారం ఉదయం స్థలాన్ని పరిశీలించారు. పాఠశాలల ఆవరణలో మొక్కలు నాటేందుకు అనువైన స్థలాన్ని పరిశీలించి, త్వరలో ఒక్కో పాఠశాలలో సుమారు 2000 మొక్కల చొప్పున నాటేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ వై శంకరరావు పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే అశోక్ రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరిన ప్రముఖ న్యాయవాది మదిరె రంగసాయి రెడ్డి

**గిద్దలూరు, సిటిజన్ టైమ్స్ సెప్టెంబర్ 2**

గిద్దలూరు పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ప్రముఖ న్యాయవాది మదిరె రంగసాయి రెడ్డి ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అశోక్ రెడ్డి ఆయనకు పార్టీ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. న్యాయవాది మదిరె రంగసాయి రెడ్డి మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీకి పూర్తి విధేయుడిగా ఉండి బలోపేతానికి కృషి చేస్తాను అని తెలిపారు.



# వెల్లుపల్లిలో 1,421 మంది రైతులకు పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ

## రైతుల భూములకు హక్కు, భద్రత కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం -ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి

**గిద్దలూరు, సిటిజన్ టైమ్స్ సెప్టెంబర్ 2**

గిద్దలూరు మండలం అంబవరం రెవిన్యూ పరిధిలోని వెల్లుపల్లి గ్రామంలో "మీ భూమి -- మీ హక్కు" కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ రాజముద్రతో కూడిన పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి మొత్తం 1,421 మంది రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అశోక్ రెడ్డి మాట్లాడుతూ రైతుల భూములకు సంబంధించిన హక్కులను మరింత పటిష్టం చేసి, ఎటువంటి అవకతవకలు లేకుండా బార్కోడ్ లో క్లుప్తముగా భూయజమాని వివరాలు పొందుపరిచి భూమిపై రైతులకు పూర్తి భద్రత కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. "మీ భూమి -- మీ హక్కు" కార్యక్రమం ద్వారా రైతులకు ప్రభుత్వ రాజముద్రతో పట్టాదారు పాసుపుస్తకాలను అందించడం సంతోషకరమైన విషయమని పేర్కొన్నారు. రైతుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందన్నారు. మన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కృషి ఫలితంగా నేటితో మన ప్రాంత రైతుల కష్టాలు తీరనున్నాయని వెలుగొండ ప్రాజెక్టు ద్వారా నీరు విడుదల అయిన సందర్భంగా ప్రతి ఎకరాకు సాగు నీరు అందించాలని, ప్రతి ఇంటికి త్రాగు నీరు అందించి ఫ్లోరైడ్ ప్రభావం



తగ్గించి సురక్షితమైన నీటిని అందించడం జరుగుతుందని, హార్టీ కల్చర్ హబ్ ద్వారా పండ్ల తోటలు వేయడం వలన రైతులకు లబ్ధిదారులకు, మంచి లాభసాటి దిగుబడి వస్తుందని ప్రాంత అభివృద్ధి చెందుతుంది అని రైతులు, ప్రజలు సంతోషంగా ఉండాలని ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని మంచి చేసే ప్రభుత్వం నీ ఎప్పుడు మన హృదయాల్లో నిల్పుకోవలని, ఎన్నుకోవాలి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో గిద్దలూరు



మండల తహసీల్దార్ ఆంజనేయరెడ్డి , మార్కెట్ యార్డ్ చైర్మన్ బైలడుగు బాలయ్య, జెడ్పీటీసి బుడతా మధు సుధన్ యాదవ్, మండల పార్టీ అధ్యక్షులు మార్తాల సుబ్బారెడ్డి, సొసైటీ బ్యాంక్ డైరెక్టర్ బద్రి గోపాల్ రెడ్డి, క్లస్టర్ ఇంచార్జీ కంకర వెంకట రెడ్డి, వీర్ల అల్లూరయ్య, శ్రీనివాస్ రెడ్డి, రామ లింగస్వామి,దొంతరి రామయ్య, అల్లం రంగస్వామి, సాగనబోయిన తిరుపతయ్య, పూల వెంకటేశ్వర్లు,రెవెన్యూ అధికారులు, ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, రైతులు పాల్గొన్నారు.

# పేదల పెన్నిధి వై యస్ ఆర్...

# వెలుగొండ ప్రాజెక్టుపై వైసీపీ నేతల ధ్వజం



**పుల్లల చెరువు, సిటిజన్ టైమ్స్ సెప్టెంబర్ 2**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, దివంగత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి 17వ వర్ధంతి వేడుకలను బుధవారం పుల్లల చెరువు మండల కేంద్రంలో వైసీపీ పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ విగ్రహానికి నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం ఆయన చేసిన సేవలను స్మరించుకుంటూ పలువురు నాయకులు మాట్లాడారు.ఈ సందర్భంగా రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి, పుల్లల చెరువు వైస్ ఎంపీపీ లింగంగుంట్ల రాములు మాట్లాడుతూ.. నిరుపేద ప్రజల సంక్షేమమే లక్ష్యంగా వైఎస్సార్ పాలన సాగించారని అన్నారు.ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా పేదలు, రైతులు, మహిళలు, విద్యార్థులు, వృద్ధులు, బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి అనేక కార్యక్రమాలు అమలు చేశారని గుర్తుచేశారు.రైతుల సంక్షేమానికి ప్రాధాన్యమిస్తూ వ్యవసాయ రంగానికి ఊతమిచ్చారని, విద్యార్థులకు ఉన్నత విద్య అందుబాటులోకి తీసుకురావడానికి పలు విద్యా పథకాలు అమలు చేశారని రాములు పేర్కొన్నారు. పేదల ఆరోగ్య పరిరక్షణ కోసం ఆరోగ్యశ్రీ వంటి కార్యక్రమాలను తీసుకువచ్చి వైద్యం ఖర్చులతో ఇబ్బందులు పడుతున్న నిరుపేద కుటుంబాలకు అండగా నిలిచారని తెలిపారు.మహిళలు, పేదల సంక్షేమానికి పెద్దపీట వైఎస్సార్ హయాంలో మహిళల సంక్షేమానికి కూడా ప్రత్యేక ప్రాధాన్యం లభించిందని నాయకులు తెలిపారు. మహిళల ఆర్థిక సాధికారతకు వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూత వంటి కార్యక్రమాలు, వృద్ధులు, నిరుపేదలకు పెన్షన్ కానుక, పేదల ఇళ్ల కోసం వివిధ గృహ నిర్మాణ కార్యక్రమాలు అమలు చేశారని పేర్కొన్నారు.పేద కుటుంబాలకు విద్య, వైద్యం, వ్యవసాయం, సామాజిక భద్రత వంటి రంగాల్లో ప్రభుత్వ సహకారం అందించేందుకు వైఎస్సార్ అనేక సంక్షేమ కార్యక్రమాలకు రూపకల్పన చేశారని నాయకులు గుర్తుచేశారు. ఆయన మరణించి సంవత్సరాలు గడిచినా పేదలు, రైతులు, బలహీన వర్గాల ప్రజల హృదయాల్లో వైఎస్సార్ చెరగని స్థానం సంపాదించుకున్నారని అన్నారు.జడ్పీటీసీ వాగ్య నాయక్ మాట్లాడుతూ.. ప్రకాశం జిల్లాతో పాటు పరిసర ప్రాంతాల ప్రజల చిరకాల స్వప్నమైన వెలుగొండ ప్రాజెక్టుకు డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి 2004లో శిలాఫలకం వేసి పనులకు శ్రీకారం చుట్టారని గుర్తుచేశారు. వైఎస్సార్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలోనే వెలుగొండ ప్రాజెక్టు పనులు వేగంగా ముందుకు సాగాయని తెలిపారు.వైఎస్సార్ హయాంలో సుమారు 70 శాతం పనులు పూర్తయ్యాయని వాగ్య నాయక్ పేర్కొన్నారు.అనంతరం అధికారంలోకి వచ్చిన చంద్రబాబు నాయుడు ప్రభుత్వం వెలుగొండ ప్రాజెక్టు పనులపై సరైన దృష్టి పెట్టలేదని ఆయన విమర్శించారు.పనులను ముందుకు తీసుకెళ్లకుండా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా వ్యవహరించారని ఎద్దేవా చేశారు.2019లో వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం వెలుగొండ ప్రాజెక్టు పనులకు ప్రాధాన్యం ఇచ్చి సుమారు 20 శాతం పనులను పూర్తి చేసిందని వాగ్య నాయక్ తెలిపారు. ప్రస్తుతం మిగిలిన సుమారు 10 శాతం పనులను పూర్తి చేసిన అనంతరం మొత్తం ప్రాజెక్టును తామే పూర్తి చేశామని టీడీపీ నాయకులు చెప్పుకోవడం సరికాదని విమర్శించారు.వెలుగొండ ప్రాజెక్టు నిర్మాణం కోసం గతంలో చేపట్టిన పనులను, ఆయా ప్రభుత్వాల పాత్రను ప్రజలు గుర్తుంచుకున్నారని వాగ్య నాయక్ అన్నారు.ప్రాజెక్టు కోసం సంవత్సరాలుగా పోరాడుతున్న రైతులు, ప్రజల ఆకాంక్షలను విస్మరించి రాజకీయ ప్రయోజనాల కోసం ప్రాజెక్టు ఘనతను ఒక్క పార్టీకి ఆపాదించడం తగదని పేర్కొన్నారు.మిగిలిన పనులు పూర్తి చేసి మొత్తం ప్రాజెక్టు తమ ప్రభుత్వ ఘనతేనంటూ టీడీపీ నాయకులు చెప్పుకోవడం ద్వారా గత ప్రభుత్వాల కృషికి క్రెడిట్ చోరీ చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. వెలుగొండ ప్రాజెక్టు చరిత్రను ప్రజలకు వాస్తవాలతో వివరించాల్సిన అవసరం ఉందన్నారు.వైఎస్సార్ ఆశయాలను కొనసాగిస్తూ పేదలు, రైతులు, మహిళలు, బలహీన వర్గాల కోసం నిరంతరం పనిచేయడమే ఆయనకు నిజమైన నివాళి అని నాయకులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో చాపల మడుగు మాజీ సర్పంచ్ సత్తి రెడ్డి, వైసీపీ ప్రకాశం జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ కోర్లకుంట జానకీ రఘు, నాయుడు పాలెం మాజీ సర్పంచ్ ఆవుల కోటిరెడ్డి, మల్లపాలెం మాజీ సర్పంచ్ రమణ రెడ్డి, శివ రెడ్డి, కంచర్ల కొండలు, దినేష్,కుదుముల కాశయ్య, ఖాసీం, బాజీ,వైసీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకల్లో ఉచిత కంటి వైద్య శిబిరం

## కేక్ కట్ చేసి ప్రారంభించిన సమ్మన బ్రదర్స్



**సి ఎస్ పురం, సిటిజన్ టైమ్స్ సెప్టెంబర్ 2**

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ జన్మదినాన్ని పురస్కరించుకుని మండలంలోని అయ్యలూరివారిపల్లి గ్రామంలో బుధవారం కేక్ కట్ చేసి ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సమ్మన రమేష్, సమ్మన రమణయ్య, సమ్మన తిరుపతి ఆధ్వర్యంలో ప్రారంభించారు ఒంగోలులోని స్నేహ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వారి సహకారంతో ఈ శిబిరం ఏర్పాటు చేసి డాక్టర్ యడ్లవల్లి సాయి స్నేహ ఆధ్వర్యంలో వైద్య బృందం 170 మందికి ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారు. కంటి సమస్యలు ఉన్న వారికి వైద్య సలహాలు అందించడంతో పాటు అవసరమైన వారికి ఉచితంగా కళ్లద్దాలు, మందులు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా డాక్టర్ సాయి స్నేహ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో కంటి సమస్యలతో బాధపడుతున్న వారికి సకాలంలో వైద్య పరీక్షలు



అందించాలనే ఉద్దేశంతో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అభిమానుల ఆహ్వానం మేరకు ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కంటి సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ముఖ్యంగా వృద్ధులు కంటి చూపులో మార్పులు కనిపించిన వెంటనే వైద్యులను సంప్రదించాలని అన్నారు.పవన్ కళ్యాణ్ జన్మదినం సందర్భంగా ప్రజలకు ఉపయోగపడే విధంగా వైద్య శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. అనంతరం జనసేన పార్టీ నాయకులు భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

# మహానేత వైయస్సార్‌కు ఘన నివాళులర్పించిన పులి రామచంద్రారెడ్డి




**సి.ఎస్.పురం, సిటిజన్ టైమ్స్ సెప్టెంబర్ 2**

మండలంలోని ముండ్లపాడు గ్రామానికి చెందిన వైఎస్సార్సీపీ సీనియర్ నాయకులు పులి రామచంద్రరెడ్డి ఆధ్వర్యంలో దివంగత మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి 17వ వర్ధంతి కార్యక్రమాన్ని బుధవారం మద్రాసు ఓఎంఆర్ మహి పీజీలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా పులి రామచంద్రరెడ్డి మాట్లాడుతూ వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో పేదలు, రైతులు, విద్యార్థులు, బడుగు బలహీన వర్గాలకు అనేక సంక్షేమ పథకాలను అమలు చేసి ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్నారని కొనియాడారు.వైఎస్సార్ భౌతికంగా మన మధ్య లేకపోయినా ఆయన చేసిన సేవలను ప్రజలు ఇప్పటికీ స్మరించుకుంటున్నారని అన్నారు. పేదల సంక్షేమం కోసం ఆయన చేసిన కృషి ఎప్పటికీ గుర్తుండిపోతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బొర్రాజు రమణయ్య, గుమ్మ మురళి, రామిశెట్టి బాబు, వెంగల్ రెడ్డి పీరారెడ్డి, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

# పొదిలిలో ఘనంగా పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు





**పొదిలి, సిటిజన్ టైమ్స్ సెప్టెంబర్ 2**

రాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధ్యక్షులు కొణిదల పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. బుధవారం నాడు పొదిలిలో వేడుకలను ఆ పార్టీ నాయకులు హల్ చల్ జహీర్ ఆధ్వర్యంలో ఎంతో అట్టహాసంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ బర్త్డే కేక్ ను ఏర్పాటు చేసి కట్ చేసిన ఆ పార్టీ నాయకులు అందరికీ పంచి పెట్టారు. అలాగే పవన్ కళ్యాణ్ బర్తడే సందర్భంగా పెదకాకానికి చెందిన శంకర నేత్రాలయ సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని కూడా నిర్వహించారు. అలాగే వైద్య సాయం కోసం వచ్చిన కంటి రోగులకు ఉచితంగా అన్నదాన ఏర్పాటును కూడా ఏర్పాటు చేశారు. ఎంతో అట్టహాసంగా నిర్వహించిన ఆయా కార్యక్రమాలకు పొదిలి ఏఎంసి చైర్మన్ డాక్టర్ సయ్యద్ ఇమాంస, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యదర్శి వరికుంట్ల అనిల్ కుమార్, రాష్ట్ర మైనారిటీ కార్పొరేషన్ డైరెక్టర్ సాదిక్ తో పాటు తెలుగుదేశం, జనసేన పార్టీలకు చెందిన నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు..



**పుల్లల చెరువు, సిటిజన్ టైమ్స్ సెప్టెంబర్ 2**

జనసేన పార్టీ అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలను పుల్లలచెరువు మండల కేంద్రంలో బుధవారం ఘనంగా నిర్వహించారు.యర్రగొండపాలెం మార్కెట్ యార్డు డైరెక్టర్ పసులేటి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలకు జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.పవన్ కళ్యాణ్ జన్మదినాన్ని పురస్కరించుకుని స్థానిక ఆర్టీసీ బస్టాండ్ నుంచి జనసేన పార్టీ ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. పార్టీ జెండాలు చేతబూని అభిమానులు, కార్యకర్తలు ఉత్సాహంగా ర్యాలీలో పాల్గొన్నారు. మండల కేంద్రంలోని ప్రధాన వీధుల మీదుగా ర్యాలీ కొనసాగడంతో పుల్లలచెరువులో సందడి వాతావరణం నెలకొంది. పవన్ కళ్యాణ్‌కు అనుకూలంగా అభిమానులు నినాదాలు చేస్తూ తమ అభిమానాన్ని చాటుకున్నారు.అనంతరం స్థానిక ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పవన్ కళ్యాణ్ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో మరిన్ని పుట్టినరోజులు జరుపుకోవాలని ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రజలకు మరింత సేవ చేసే అవకాశం ఆయనకు కలగాలని కోరుకున్నారు.అనంతరం జనసేన పార్టీ కార్యాలయంలో భారీ కేక్‌ను కట్ చేసి పవన్ కళ్యాణ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.పవన్ కళ్యాణ్ జన్మదినాన్ని పురస్కరించుకుని పలు సామాజిక కార్యక్రమాలను కూడా నిర్వహించారు.ఈ సందర్భంగా పసులేటి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ ఆశయాలు, సిద్ధాంతాలకు అనుగుణంగా ప్రజలకు సేవ చేయడమే తమ లక్ష్యమన్నారు. ఆయన జన్మదిన వేడుకలను ప్రతి ఏడాది ఘనంగా నిర్వహిస్తూ సామాజిక సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# దీపిక మాటలు కాదు.. చేతల్లో చూపించాలి

తాను ప్రభాస్ కంటే ఎక్కువ సినిమాలు చేశానని.. తన కంటే ఎక్కువ సక్సెస్ ఫుల్ అన్నట్లుగా దీపికా పదుకొనే ఇటీవల ఒక కార్యక్రమంలో చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారమే రేపుతున్నాయి. వేరే హీరో అంటే ఏమో కానీ.. దేశవ్యాప్తంగా తిరుగులేని అభిమానాన్ని సంపాదించుకుని ఇండియాలో బిగ్గెస్ట్ సూపర్ స్టార్‌గా అవతరించిన ప్రభాస్‌ను.. వివాదాలకు దూరంగా ఉంటూ, ఎంత ఎదిగినా ఒదిగి ఉండే హీరో మీద పరోక్షంగా తన అక్కసు వెళ్లగక్కడం.. తనతో పోటీ పెట్టుకుని మాట్లాడ్డం.. అతణ్ని కించపరిచేలా మాట్లాడ్డం తెలుగు వాళ్లకే కాదు.. ఇతర భాషల వాళ్లకు కూడా నచ్చట్లేదు. ఎప్పుడూ వివాదాలతో సహవాసం చేసే దీపికకు ముందు నుంచే సోషల్







మీడియాలో హేటర్స్ ఎక్కువ. తాజా వ్యాఖ్యలతో ఆమె మీద వ్యతిరేకత మరింత పెరిగిపోతోంది. దీపిక పాస్ట్ ఎఫైర్ల దగ్గర్నుంచి.. వివిధ సందర్భాల్లో ఆమె చేసిన వివాదాస్పద వ్యాఖ్యలకు సంబంధించిన వీడియోల వరకు తీసుకొచ్చి ఆమెను ట్రోల్ చేస్తున్నారు. ఇదంతా పక్కన పెడితే.. ప్రభాస్ కంటే తాను పెద్ద స్టార్ అన్నట్లు చెప్పుకుంటూ తనకు దీటుగా పారితోషకం డిమాండ్ చేస్తున్న దీపికకు నెటిజన్లు ఒక సలహా ఇస్తున్నారు. నిజంగా దీపిక అంత పెద్ద స్టార్, తనకు భారీ మార్కెట్ ఉందని నమ్ముతున్నట్లయితే.. మేల్ సూపర్ స్టార్లతో కలిసి చేసే సినిమాల్ల వారితో పోటీ పెట్టుకునే బదులు ఒక లేడీ ఓరియెంటెడ్ మూవీ చేసి తన బాక్సాఫీస్ స్టామినా ఎంతో రుజువు చేయాలని అంటున్నారు. తనే లీడ్ రోల్ చేసిన సినిమాతో తాను ఎన్ని వందల కోట్లు రాబట్టగలదో చూపిస్తే.. ఆమె ఫాలోయింగ్, మార్కెట ఎంత అన్నది అందరికీ అర్థమవుతుంది కదా అని అభిప్రాయపడుతున్నారు. చివరగా దీపిక నటించిన లేడీ ఓరియెంటెడ్ మూవీ 'చప్పక్' అయితే రూ.5' కోట్లకు అటు ఇటుగా వసూళ్లు రాబట్టింది. అది 2020లో రిలీజైన సినిమా. పైగా అదొక ప్రయోగాత్మక చిత్రం. ఇప్పటికి దీపిక మార్కెట్ ఇంకా పెరిగి ఉంటుంది కాబట్టి.. ఇప్పుడు ఒక యాక్షన్ టచ్ ఉన్న లేడీ ఓరియెంటెడ్ సినిమా చేసి దీపిక తన స్టామినా ఏంటో చూపించాలి. ఆ సినిమా ప్రభాస్ చిత్రాల్లాగే వందలు, వేల కోట్ల వసూళ్లు రాబడితే.. అందుకు తగ్గట్లే పారితోషకం కోసం డిమాండ్ చేయొచ్చు. ప్రభాస్ కంటే తానే పెద్ద స్టార్, సక్సెస్ ఫుల్ అని బల్లగుద్ది చెప్పొచ్చు.

## రోహిత్ అనుభవం, కోహ్లీ దూకుడు.. 2027 ప్రపంచకప్‌లో భారత జట్టుకు అవే బలం: జాంటీ రోడ్స్

- 2027 ప్రపంచకప్ కోసం రోహిత్ అనుభవం జట్టుకు ఎంతో అవసరమన్న రోడ్స్
- ప్రపంచకప్ లాంటి టోర్నీల్లో ప్రతిభ కన్నా మానసిక బలమే కీలకమని వ్యాఖ్య
- కోహ్లీ దూకుడును ఒకప్పటి ఆస్ట్రేలియా జట్టుతో పోల్చిన దక్షిణాఫ్రికా మాజీ దిగ్గజం
- కోహ్లీ ప్రపంచంలోనే బెస్ట్ ఛేజర్, అల్టిమేట్ ఫినిషర్ అని ప్రశంస
- కెప్టెన్‌గా ఉన్నా లేకున్నా, భారత్ గెలవాలనే కోహ్లీ తపన అమోఘమన్న రోడ్స్



భారత క్రికెట్ జట్టులో సీనియర్ ఆటగాళ్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీల ప్రాముఖ్యతను దక్షిణాఫ్రికా మాజీ క్రికెట్ దిగ్గజం జాంటీ రోడ్స్ నొక్కిచెప్పాడు. 2027 వన్డే ప్రపంచకప్‌ను దృష్టిలో ఉంచుకుని జట్టును సిద్ధం చేస్తున్న తరుణంలో రోహిత్ శర్మ అపారమైన అనుభవం టీమిండియాకు ఒక భారీ ఆస్తి అని అభిప్రాయపడ్డాడు. అదే సమయంలో విరాట్ కోహ్లీలోని గెలుపు తపన, దూకుడును ఒకప్పటి ఆస్ట్రేలియా జట్టుతో పోల్చి ప్రశంసలు కురిపించాడు. జియోస్టార్‌తో మాట్లాడుతూ జాంటీ రోడ్స్ పలు ఆసక్తికర విషయాలు పంచుకున్నాడు. "2027 ప్రపంచకప్ కోసం భారత జట్టు ప్రణాళికలు రచిస్తున్నప్పుడు, రోహిత్ శర్మ లాంటి అనుభవజ్ఞుడైన ఆటగాడు జట్టులో ఉండటం అమూల్యమైనది. మనం తరచుగా ఆటగాళ్ల ప్రతిభ, వారి ప్రదర్శనల గురించే చర్చిస్తాం. కానీ, ప్రపంచకప్ లాంటి అత్యంత ఒత్తిడితో కూడిన టోర్నీల్లో మానసిక బలం అనేది చాలా కీలకం. ఈ విషయాన్ని సెలక్షన్‌లో అంతగా పట్టించుకోం" అని రోడ్స్ పేర్కొన్నాడు. తాను నాలుగు ప్రపంచకప్‌లు ఆడినా రెండు సెమీఫైనల్స్ దాటలేకపోయానని, ఆ టోర్నీల్లో ఒత్తిడి ఏ స్థాయిలో ఉంటుందో తనకు బాగా తెలుసని గుర్తుచేశాడు. ఇలాంటి పరిస్థితుల్లో రోహిత్ లాంటి ఆటగాడి అనుభవం జట్టుకు ఎంతో మేలు చేస్తుందని వివరించాడు. ఇప్పటివరకు 288 వన్డేల్లో 34 సెంచరీలు, 62 అర్ధ సెంచరీలతో దాదాపు 12 వేల పరుగులు చేసిన రోహిత్, 2019 ప్రపంచకప్‌లో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. రోహిత్ గురించి మాట్లాడుతూనే, జాంటీ రోడ్స్ విరాట్ కోహ్లీపై కూడా ప్రశంసల వర్షం కురిపించాడు. కోహ్లీలోని గెలుపు కసిని, దూకుడును ఒకప్పటి ఆస్ట్రేలియా జట్టుతో పోల్చాడు. "ఒకప్పుడు ప్రపంచకప్‌లను ఆస్ట్రేలియా ఎలా శాసించిందో మనం చూశాం. గెలవాలనే వారి తపన, దూకుడు అమోఘం. సరిగ్గా అలాంటి గెలుపు ఆకలి విరాట్ కోహ్లీలో కనిపిస్తుంది. జట్టును గెలిపించాలనే సంకల్పం అతనిలో బలంగా ఉంటుంది" అని రోడ్స్ అన్నాడు. ప్రపంచంలోనే బెస్ట్ ఛేజర్‌గా, టీమిండియాకు అల్టిమేట్ ఫినిషర్‌గా కోహ్లీ నిలిచాడని కొనియాడాడు. "ఛేజింగ్‌లో కోహ్లీ స్థిరంగా రాణించడం, జట్టును విజయతీరాలకు చేర్చాలనే అతని పట్టుదలను తెలియజేస్తుంది. అతను పోటీని, పోరాటాన్ని ఇష్టపడతాడు. కెప్టెన్‌గా ఉన్నా లేకపోయినా, భారత్ గెలవాలనే అతని డ్రైవ్ మాత్రం మారదు" అని జాంటీ రోడ్స్ స్పష్టం చేశాడు. 314 వన్డేల్లో 54 సెంచరీలతో దాదాపు 15 వేల పరుగులు చేసిన కోహ్లీ గణాంకాలే అతని సత్తాను తెలియజేస్తాయని అన్నాడు.

## దులీప్ ట్రోఫీ ఫైనల్లో సౌత్ జోన్.. కెప్టెన్ ఇన్నింగ్స్‌తో గెలిపించిన తిలక్ వర్మ



దులీప్ ట్రోఫీ 2026/27 సీజన్‌లో సౌత్ జోన్ ఫైనల్‌కు దూసుకెళ్లింది. నార్త్ జోన్‌తో జరిగిన సెమీ ఫైనల్లో కెప్టెన్ తిలక్ వర్మ అద్భుతమైన కెప్టెన్ ఇన్నింగ్స్‌తో జట్టును ముందుండి నడిపించాడు. ఏడు వికెట్ల తేడాతో సునాయాస విజయాన్ని అందించి, టైటిల్ పోరుకు అర్హత సాధించేలా చేశాడు. సెప్టెంబర్ 6 నుంచి చెన్నైలోని ఎంఏ చిదంబరం స్టేడియంలో జరిగే ఫైనల్లో ఇషాన్ కిషన్ నేతృత్వంలోని ఈస్ట్ జోన్‌తో సౌత్ జోన్ తలపడనుంది. మ్యాచ్ చివరి రోజు 181 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన సౌత్ జోన్‌కు కెప్టెన్ తిలక్ వర్మ (79 బంతుల్లో 51 నాటౌట్) అండగా నిలిచాడు. మొదటి ఇన్నింగ్స్‌లో కీలకమైన సెంచరీ (116 నాటౌట్)తో జట్టును ఆదుకున్న తిలక్, రెండో ఇన్నింగ్స్‌లోనూ అదే బాధ్యతాయుతమైన ఆటతీరును ప్రదర్శించాడు. రవిచంద్రన్ స్మరణ్ (32 నాటౌట్)తో కలిసి నాలుగో వికెట్‌కు అబేధ్యంగా 80 పరుగులు జోడించి జట్టు విజయాన్ని ఖాయం చేశాడు. అంతకుముందు నాలుగో రోజు ఆట ప్రారంభించిన నార్త్ జోన్ భారీ లక్ష్యాన్ని నిర్దేశించాలని భావించింది. అయితే, సౌత్ జోన్ పేసర్ ఎండీ నిధీశ్ వారి ప్రణాళికలను దెబ్బతీశాడు. వరుస విరామాల్లో వికెట్లు తీసి నార్త్ జోన్ పతనాన్ని శాసించాడు. చివరి మూడు వికెట్లను పడగొట్టి, ఇన్నింగ్స్‌లో మొత్తం 5 వికెట్లు (5/56) సాధించాడు. ఫస్ట్-క్లాస్ క్రికెట్‌లో అతనికి ఇది 10వ ఐదు వికెట్ల ప్రదర్శన. దీంతో నార్త్ జోన్ రెండో ఇన్నింగ్స్‌లో 297 పరుగులకు ఆలౌట్ అయింది. లక్ష్య ఛేదనలో సౌత్ జోన్‌కు ఓపెనర్ రికీ భుయ్ (42) దూకుడైన ఆరంభాన్ని ఇచ్చాడు. అయితే, లంచ్ విరామానికి ముందు, ఆ తర్వాత నార్త్ జోన్ స్పిన్నర్ అబిద్ ముస్తాక్ విజృంభించడంతో మ్యాచ్ కాస్త ఉత్కంఠగా మారింది. రికీ భుయ్‌ను గుర్నూర్ బ్రార్ ఔట్ చేయగా, షేక్ రషీద్, నారాయణ్ జగదీశన్ (43) వికెట్లను ముస్తాక్ పడగొట్టాడు. దీంతో సౌత్ జోన్ 102 పరుగులకే 3 వికెట్లు కోల్పోయి ఒకింత కష్టాల్లో పడింది. ఈ క్లిష్ట సమయంలో క్రీజులోకి వచ్చిన కెప్టెన్ తిలక్ వర్మ, గత రంజీ సీజన్ టాప్ స్కోరర్ అయిన స్మరణ్ తో కలిసి ఇన్నింగ్స్‌ను చక్కదిద్దాడు. పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలిస్తుండటంతో స్పిన్ బౌలింగ్‌ను సమర్థంగా ఎదుర్కొంటూ, అవసరమైనప్పుడు వేగం పెంచుతూ జట్టును విజయ తీరాలకు చేర్చాడు. గతేడాది ఫైనల్లో ఓటమిపాలైన సౌత్ జోన్, ఈసారి బలమైన ఆత్మవిశ్వాసంతో టైటిల్ పోరుకు సిద్ధమవుతోంది. మరో సెమీస్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ సెంట్రల్ జోన్‌ను ఓడించి ఈస్ట్ జోన్ ఫైనల్‌కు చేరుకుంది. విశేషమేమిటంటే.. 1970/71 సీజన్ తర్వాత దులీప్ ట్రోఫీ ఫైనల్లో సౌత్ జోన్, ఈస్ట్ జోన్ తలపడటం ఇదే తొలిసారి.

## చైనా మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నీ నుంచి లక్ష్య సేన్ ఔట్

**హైదరాబాద్ పెన్ పవర్:** చైనా మాస్టర్స్ టోర్నీలో భారత స్టార్ షట్లర్ లక్ష్య సేన్ తీవ్రంగా నిరాశ పర్చాడు. టోర్నీ తొలి రౌండ్‌లోనే కెనడాకు చెందిన విక్టర్ లాయ్ చేతిలో తేడాతో ఓటమి పాలై ఇంటిబాట పట్టాడు. బుధవారం (సెప్టెంబర్ 2) షెన్?జెన్ వేదికగా జరిగిన ఈ పోరులో ప్రపంచ ర్యాంకింగ్‌లో తొమ్మిదో స్థానంలో విక్టర్ కేవలం 38 నిమిషాల్లోనే 14-21, 7-21 తేడాతో భారత షట్లర్?ను మట్టికరిపించాడు. భారత షట్లర్ లక్ష్య సేన్ 4-0 ఆధిక్యంతో గేమ్?ను ఘనంగా ఆరంభించాడు. కానీ చివరి వరకు ఆ ఊపును నిలబెట్టుకోలేకపోయాడు. విక్టర్ లాయ్ బలంగా తిరిగి పుంజుకున్నాడు. వ్యూహాత్మక డిఫెన్స్?తో భారత ఆటగాడిని ఒత్తిడిలోకి నెట్టాడు. దీంతో లక్ష్యసేన్ ర్యాలీలను ఛేదించడానికి ఇబ్బంది పడుతూ మరింత ఎక్కువగా రిస్క్ తీసుకోవడం ప్రారంభించాడు. సేన్ పదేపదే



బ్యాక్‌హ్యాండ్ సైడ్‌లైన్ వైపు షాట్లు మిస్ చేస్తుండటంతో ఒత్తిడి మరింత తీవ్రమైంది. లాయ్ ఆ పొరపాట్లను తనకు అనుకూలంగా మలుచుకుని తొలి గేమ్‌ను 21-14 తేడాతో గెలుపొందాడు. తొలి రౌండ్ కోల్పోయిన లక్ష్య సేన్?కు రెండో రౌండ్?లో తిరిగి కోలుకునే అవకాశమే లేకుండా పోయింది. బలమైన అటాకింగ్, డిఫెన్స్ గేమ్?తో విక్టర్ లాయ్ పూర్తి ఆధిపత్యం చెలాయించాడు. 4-11తో వెనకబడ్డ లక్ష్యసేన్ పాయింట్ల అంతరాన్ని పూడ్చేందుకు తీవ్రంగా ప్రయత్నించాడు. ఈ క్రమంలో మరిన్ని అనవసర తప్పిదాలు చేసి తగిన మూల్యం చెల్లించుకున్నాడు. కెనడియన్ ఆటగాడు రెండో గేమ్‌ను 21-7 తేడాతో కైవసం చేసుకున్నాడు. దీంతో తొలి రౌండ్ లోనే భారత ఆటగాడు టోర్నీ నుంచి నిష్క్రమించాడు.

Printed, published,and owned by kancherla Sandeep kumar. Published at Door. No. 19-57, Deendayalpuram, mudasarlova, Visakhapatanam, Andrapradesh 530040.
Printed at Sri Sai Ganga printer's and publications flat no. 504,Bharat towers, 5th lane, Dwarakanagar, Visakhapatanam,Andrapradesh 530016.
Editor. Kancherla Sandeep Kumar. RNI No. APTEL /2009/28868.PHONE No. 9966447776